# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 58, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం -16 - మే - 2025


## ఆపరేషన్ సిందూర్

### ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేసిన భారత టెక్ సత్తా




ఇటీవల పాక్ పై ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్ పాక్ గగనతల రక్షణను ఛేదించి ఉగ్ర స్థావరాలపై విజయవంతమైన దాడులు కీలకపాత్ర పోషించిన స్వదేశీ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, దేశీయ తయారీ ఆయుధాలు

## భూ రికార్డుల ప్రక్షాళనకు కేంద్రం బృహత్ ప్రణాళిక...

### టెక్నాలజీతో సమగ్ర సర్వే: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



భూ వివాదాల పరిష్కారానికి కేంద్రం కొత్త సర్వే

టెక్నాలజీతో సమగ్ర భూ సర్వే, రీసర్వే

మొదటి దశకు రూ.3000 కోట్లు, రెండేళ్లలో పూర్తి

గుంటూరులో కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రకటన

## పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే

### కేంద్ర మంత్రి జైశంకర్ స్పష్టీకరణ



పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే ఉంటాయని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ ఆపరేషన్ సిందూర్ ద్వారా కీలక లక్ష్యాలను భారత్ సాధించిందని వెల్లడి పహల్గామ్ దాడి తర్వాత భారత్‌కు విస్తృత అంతర్జాతీయ మద్దతు లభించిందన్న జైశంకర్

## ఏపీలో 19 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం..

### 35 వేల ఉద్యోగ అవకాశాలు

- రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.
- ఇప్పటి వరకు ఆరు ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం



అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఆరు ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డు ద్వారా పర్యవేక్షణ జరగాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 6వ ఎస్ఐపీబీ సమావేశం ముగిసింది. 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం మిగతా..2లో

## సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో నిరాశ



ఎస్సీ, ఎస్టీ కేసు.. భార్గవ్‌రెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

ట్రయల్ కోర్టుకే వెళ్లమన్న సుప్రీం

సీనియర్ న్యాయవాది వాదనల కోసం విచారణ వాయిదా

## జూన్ 21న విశాఖకు ప్రధాని మోదీ ..




- జూన్ 21న విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
- సుమారు 2లక్షల మందితో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎస్ విజయానంద్

అమరావతి,: విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం విజయవాడలోని మిగతా..2లో

## కశ్మీర్‌లో రాజ్‌నాథ్ పర్యటన.. పాక్ అణుభద్రతపై తీవ్ర ఆందోళన

- ఆపరేషన్ సిందూర్ అనంతరం రాజ్‌నాథ్ సింగ్ తొలిసారి జమ్మకశ్మీర్‌లో పర్యటన
- బాధ్యతారహిత పాకిస్థాన్ చేతిలోని అణ్వాయుధాల భద్రతపై ప్రపంచం దృష్టి సారించాలని విజ్ఞప్తి
- ఉగ్రదాడులను యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరిక
- పాక్ అణ్వాయుధాలను ఐఏఈఏ పర్యవేక్షించాలని సూచన



శ్రీనగర్: పాకిస్థాన్ అణు కేంద్రాలను అంతర్జాతీయ సంస్థ పర్యవేక్షణలోకి తీసుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశంలో ఎలాంటి ఉగ్రవాద దాడి జరగనంత వరకే ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం శ్రీనగర్‌లోని బాదామీ బాగ్ కంటోన్మెంట్ ప్రాంతంలోని సైనిక ప్రధాన కార్యాలయంలో ఆర్మీ సైనికులను ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మిగతా..2లో

## మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి

- బీహార్ లో రాహుల్ గాంధీ పర్యటన
- దర్భంగాలో కాంగ్రెస్ అగ్రనేతను అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థులతో మాట్లాడడం ఎప్పటి నుంచి నేరంగా మారిందన్న రాహుల్



న్యూఢిల్లీ,: బీహార్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, సీఎం నితీశ్ కుమార్ లపై ధ్వజమెత్తారు. దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌లో విద్యార్థులతో 'శిక్షా న్యాయ్ సంవాద్' పేరిట తలపెట్టిన ముఖాముఖి కార్యక్రమానికి వెళుతున్న ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మిగతా..2లో

## హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు...

### రూ. 32 కోట్ల ఆస్తుల స్వాధీనం



- ముంబై వసాయి విరార్ కార్పొరేషన్ (వీవీఎంసీ) స్కామ్‌పై ఈడీ దర్యాప్తు వేగవంతం
- ముంబై, హైదరాబాద్ సహా 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు స్వాధీనం

## సీఈ రమణారెడ్డికి సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్!

ప్రాజెక్టులపై రేవంత్ రెడ్డి సీరియస్ సమీక్ష

కాళేశ్వరం తరహాలో చేస్తే సహించేది లేదని హెచ్చరిక

అధికారులకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు



హైదరాబాద్, : రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి, నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ) రమణారెడ్డికి సీఎం తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. "అక్కడ (గతంలో పనిచేసిన చోట) చేసినట్లు ఇక్కడ కూడా చేస్తే కేసు పెట్టి లోపల వేయిస్తా" అంటూ సీఎం వ్యాఖ్యానించినట్లు సమాచారం. రమణారెడ్డి గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా బాధ్యతలు నిర్వర్తించిన నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ, మిగతా..2లో

## సరస్వతీనది పుష్కరస్నానమాచరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



- ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది
- పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రంముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటిశ్రీనివాస్‌రెడ్డితదితరులుసరస్వతీనది మిగతా..2లో

# ఆపరేషన్ సిందూర్

## ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేసిన భారత టెక్ సత్తా

**న్యూఢిల్లీ,:** భారత రక్షణ రంగ స్వదేశీ పరిజ్ఞానం మరోసారి తన సత్తా చాటింది. పాకిస్థాన్ దుందుడుకు చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టడమే కాకుండా, శత్రు భూభాగంలోని ఉగ్ర స్థావరాలపై విజయవంతమైన దాడులు నిర్వహించడంలో దేశీయంగా అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థలు కీలక పాత్ర పోషించాయి. ఈ పరిణామాలు భారత సాంకేతిక సామర్థ్యానికి, వ్యూహాత్మక ప్రణాళికకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

పాక్ గగనతల రక్షణ ఛేదనలో భారత నైపుణ్యం

మే 7న, కేవలం 23 నిమిషాల వ్యవధిలో, భారత వాయుసేన (ఐఏఎఫ్) పాకిస్థాన్ వద్ద ఉన్న చైనా తయారీ గగనతల రక్షణ (ఏడీ) వ్యవస్థలను ఏమార్చి, వాటిని పనిచేయకుండా జామ్ చేసి, తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించింది. పాకిస్థాన్ హెచ్‌క్యూ-9 క్షిపణి బ్యాటరీలు, రాడార్ వ్యవస్థలు భారత దాడిని పసిగట్టడంలో విఫలమయ్యాయి. ఇది భారత ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్ర నైపుణ్యానికి, సాంకేతిక ఆధిక్యతకు నిదర్శనమని ప్రభుత్వం ప్రకటించింది.

శత్రు దాడుల తిప్పికొట్టడంలో స్వదేశీ వ్యవస్థల విజయం

గత వారం తీవ్ర ఉద్రిక్తతల మధ్య, పాకిస్థాన్ ప్రతీకారంగా ప్రయోగించిన పలు క్షిపణులు, డ్రోన్లను భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థవంతంగా నిర్వీర్యం చేసింది. చైనా తయారీ పీఎల్-15 క్షిపణులు, టర్కీ మూలాలున్న బైకర్ యిహా కమికాజే డ్రోన్లు, అసిస్‌గార్డ్ సోంగర్ డ్రోన్ల వంటి అత్యాధునిక విదేశీ ఆయుధాలను పాక్ ప్రయోగించినప్పటికీ, భారత స్వదేశీ గగనతల రక్షణ నెట్‌వర్క్ ముందు అవి దిగదుడుపే అయ్యాయి.

ఆపరేషన్ సింధూర్: స్వదేశీ సాంకేతికతకు పెద్ద పీట

'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా, ఐఏఎఫ్ యొక్క పూర్తిస్థాయి ఆటోమేటెడ్ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్), ఆర్మీకి చెందిన 'ఆకాశ్‌తీర్' వ్యవస్థలు కీలకపాత్ర పోషించాయి. ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్, వివిధ రాడార్లను, గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థలను అనుసంధానించి, గగనతల వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అందించింది. "ఆకాశ్‌తీర్ వ్యవస్థ వినియోగదారుల అంచనాలను మించి పనిచేసి, ప్రస్తుత ఘర్షణ సమయంలో భారత్‌కు పటిష్టమైన వాయు రక్షణ కల్పించింది" అని బీఈఎల్ 'ఎక్స్' లో పేర్కొంది.

ఆకాశ్ అదుర్స్

ఈ బహుళ అంచెల రక్షణ కవచంలో స్వదేశీ 'ఆకాశ్' క్షిపణి వ్యవస్థ (25 కి.మీ. పరిధి) ప్రముఖ పాత్ర పోషించింది. దీనితో పాటు రష్యాకు చెందిన ఎస్-400 'ట్రయంఫ్', ఇజ్రాయెల్‌తో సంయుక్తంగా అభివృద్ధి చేసిన బరాక్-8, పెచోరా క్షిపణులు, ఎల్-70 గన్‌లు, ఇగ్లా-ఎస్ క్షిపణులు, సమీకృత డ్రోన్ గుర్తింపు, నిరోధక వ్యవస్థలు కూడా ఈ నెట్‌వర్క్‌లో భాగమే. ఈ స్వదేశీ, విదేశీ వ్యవస్థల సమన్వయం మే 9, 10 తేదీలలో పాక్ వాయుసేన దాడుల నుంచి భారత వైమానిక స్థావరాలు, లాజిస్టిక్ కేంద్రాలను కాపాడటంలో విజయవంతమైంది. ఇస్రోకు చెందిన కనీసం 10 ఉపగ్రహాలు కూడా నిరంతర పర్యవేక్షణలో పాలుపంచుకున్నాయి.

కచ్చితమైన దాడులు, స్వదేశీ ఆయుధాల వినియోగం

కాల్పుల విరమణకు ముందు, పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది వైమానిక స్థావరాలు, రాడార్ సైట్లపై భారత్ కచ్చితమైన దాడులు చేసింది. ఇందులో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, ఇతర సుదూర శ్రేణి స్వదేశీ గైడెడ్ ఆయుధాలు, డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. ఈ దాడులన్నీ భారత ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, అత్యంత ప్రభావవంతంగా, రాజకీయంగా సమతుల్యంగా జరిగాయని ప్రభుత్వ ప్రకటన వివరించింది.

రక్షణ స్వదేశీకరణకు లభించిన ధృవీకరణ

'ఆపరేషన్ సిందూర్' కేవలం వ్యూహాత్మక విజయమే కాదు, భారత రక్షణ స్వదేశీకరణ విధానాలకు లభించిన గొప్ప ధృవీకరణ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గగనతల రక్షణ వ్యవస్థలు మొదలుకుని... డ్రోన్లు, కౌంటర్-యూఏఎస్ సామర్థ్యాల నుంచి నెట్-సెంట్రిక్ యుద్ధ తంత్ర వేదికల వరకు, ప్రతిచోటా స్వదేశీ సాంకేతికత తన సత్తా చాటింది. అరాచక యుద్ధ రీతికి ఇది ఒక బ్యాలెన్స్ డ్ సైనిక ప్రతిస్పందన అని, భారత్ తన సొంత ఆవిష్కరణలు, దృఢమైన ప్రభుత్వ మద్దతు, స్వదేశీ ప్రజల ప్రతిభతో ఎలాంటి సవాల్‌కైనా సన్నద్ధంగా ఉందని ఈ ఆపరేషన్ నిరూపించింది.

# భూ రికార్డుల ప్రక్షాళనకు కేంద్రం బృహత్ ప్రణాళిక...

## టెక్నాలజీతో సమగ్ర సర్వే: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

**న్యూఢిల్లీ,:** దేశంలో భూ రికార్డుల నిర్వహణలో నెలకొన్న లోపాలను సరిదిద్ది, వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా, కేంద్ర సమన్వయంతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల సర్వే, రీసర్వే చేపట్టనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని వెల్లడించారు. సరికాని, కాలం చెల్లిన భూ రికార్డుల వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్' కింద సర్వే/రీసర్వేపై జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో మంత్రి పెమ్మసాని ప్రసంగించారు. ఈ కార్యక్రమం కేంద్ర ప్రాయోజిత పథకమని, పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి నడుస్తుందని తెలిపారు. డ్రోన్లు, విమానాల ద్వారా ఏరియల్ సర్వేలు చేయడం వల్ల సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే కేవలం 10 శాతం ఖర్చుతోనే సర్వే పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. కృత్రిమ మేధ (%ూ×%), జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, అత్యంత కచ్చితత్వంతో పనిచేసే పరికరాలను ఈ సర్వేలో వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం అమలులో రాష్ట్రాల సహకారం కీలకమని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన, ధృవీకరణలను రాష్ట్రాలు నిర్వహిస్తుండగా, కేంద్రం విధాన రూపకల్పన, నిధులు, సాంకేతిక సహకారం అందిస్తుందని వివరించారు. ఐదు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుండగా, మొదటి దశలో భాగంగా రూ.3,000 కోట్ల వ్యయంతో రెండేళ్ల వ్యవధిలో 3 లక్షల చదరపు కిలోమీటర్ల గ్రామీణ వ్యవసాయ భూముల్లో సర్వే చేపడతామని తెలిపారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ తో ఆధార్ నంబర్ల అనుసంధానాన్ని పూర్తి చేయాలని రాష్ట్రాలను ఆయన కోరారు. ఈ సంస్కరణ ద్వారా భూమి యాజమాన్యాన్ని ప్రత్యేక డిజిటల్ గుర్తింపుతో ముడిపెట్టవచ్చని, తద్వారా నకిలీలను అరికట్టి, అగ్రిస్టాక్, పీఎం-కిసాన్, పంటల బీమా వంటి ప్రయోజనాలను అర్హులకు నేరుగా అందించవచ్చని సూచించారు. రీసర్వే, డిజిటలైజేషన్, కాగిత రహిత కార్యాలయాలు, కోర్టు కేసుల నిర్వహణ, ఆధార్ అనుసంధానం వంటి సంస్కరణలు సమగ్రమైన, పారదర్శకమైన భూ పరిపాలన వ్యవస్థను సృష్టిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా రికార్డులు ఉన్నప్పుడే భూమి ఆర్థిక సామర్థ్యం పెరుగుతుందని మంత్రి పెమ్మసాని అన్నారు. దీనివల్ల బ్యాంకులు విశ్వాసంతో రుణాలు ఇవ్వగలవని, వ్యాపారవేత్తలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టగలరని, రైతులు వ్యవసాయ మద్దతును పొందగలరని పేర్కొన్నారు. "వేగవంతమైన రహదారులు, స్మార్ట్ నగరాలు, సురక్షితమైన గృహాలు, స్థిరమైన వ్యవసాయం కావాలంటే, మనం భూమి నుంచే ప్రారంభించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ కింద గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, సర్వే, రీసర్వే అనే ముఖ్యమైన అంశం ఇప్పటివరకు కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే పూర్తయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ పరిపాలనాపరంగా, సాంకేతికంగా, ప్రజా భాగస్వామ్యంతో కూడిన భారీ కసరత్తు అని అన్నారు. అనేక రాష్ట్రాలు మ్యాప్ ఆధారిత ఉపవిభజనలు చేపట్టలేదని, ప్రాదేశిక రికార్డులను అప్ డేట్ చేయలేదని, దీనివల్ల ప్రస్తుత కాడాస్ట్రల్ మ్యాప్‌లు వాడుకలో లేకుండా పోయాయని తెలిపారు. "రాజకీయ సంకల్పం, బలమైన సమన్వయం లేకపోతే సర్వేలు వేగం కోల్పోయి అసంపూర్తిగా మిగిలిపోతాయని మా అనుభవం చెబుతోంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఈ జాతీయ వర్క్‌షాప్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, నిపుణులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే

## కేంద్ర మంత్రి జైశంకర్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో భవిష్యత్తులో ఎలాంటి చర్చలు జరిగినా అవి కేవలం ఉగ్రవాదానికి సంబంధించిన అంశాలపైనే ఉంటాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గురువారం స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను విజయవంతంగా ధ్వంసం చేశామని, నిర్దేశించుకున్న లక్ష్యాలను భారత్ సాధించిందని ఆయన నొక్కిచెప్పారు. ఢిల్లీలో హొండురాస్ రాయబార కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్‌తో చర్చలు ఉగ్రవాదంపైనే ఉంటాయని ప్రధానమంత్రి చాలా స్పష్టంగా చెప్పారని నేను భావిస్తున్నాను. పాకిస్థాన్ అప్పగించాల్సిన ఉగ్రవాదుల జాబితా ఉంది, వారు ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మూసివేయాలి. వారికేం చేయాలో తెలుసు. ఉగ్రవాదంపై ఏం చేయాలో వారితో చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అవే ఆచరణ సాధ్యమైన చర్చలు" అని జైశంకర్ తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది అమాయక పౌరుల మృతికి కారణమైన దారుణమైన ఉగ్రదాడి తర్వాత భారత్‌కు అంతర్జాతీయంగా విస్తృత మద్దతు లభించిందని ఆయన గుర్తుచేశారు. ఈ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా (ఎల్ఈటీ) అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించింది. "చాలా మంది మంత్రులు, నాయకులు ప్రధానమంత్రికి ఫోన్ చేశారు, నాకు కూడా పలువురు మంత్రులు ఫోన్ చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిని బాధ్యులను చేయాలని భద్రతా మండలి తీర్మానం స్పష్టంగా పేర్కొంది. మే 7వ తేదీ ఉదయం, ఆపరేషన్ సిందూర్ ద్వారా తీసుకున్న చర్యలతో మేము వారిని బాధ్యులను చేశాం'' అని జైశంకర్ వివరించారు.

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు

అంతకుముందు శ్రీనగర్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశంలో ఎలాంటి ఉగ్రదాడి జరగనంత వరకే ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ గౌరవిస్తుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ అణుకేంద్రాలను అంతర్జాతీయ పర్యవేక్షక సంస్థ ఆధీనంలోకి తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీనగర్‌లోని బాదామీ బాగ్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ 15వ కోర్ ప్రధాన కార్యాలయంలో సైనికులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఆపరేషన్ సిందూర్ నిస్సందేహంగా భారత్ చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్. వారు మా తలపై దాడి చేయడానికి ప్రయత్నిస్తే, మేము వారి ఛాతీపై దెబ్బకొట్టి పెద్ద గాయం చేశాం'' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు...

## రూ. 32 కోట్ల ఆస్తుల స్వాధీనం

**అమరావతి,:** ముంబైకి చెందిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) పరిధిలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం అధికారులు కీలక ముందడుగు వేశారు. ముంబై, హైదరాబాద్ నగరాలతో పాటు మొత్తం 13 ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. సుమారు రూ.9.04 కోట్ల నగదుతో పాటు, రూ.23.25 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.32 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ముంబైలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో ఈ అక్రమాలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటి ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా 2009 సంవత్సరం నుంచి అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు ఈడీ గుర్తించింది. ఈ కుంభకోణంలో సీతారాం, అరుణ్ అనే వ్యక్తులు కీలక నిందితులుగా ఉన్నట్లు ఈడీ పేర్కొంది. కొందరు అవినీతి అధికారులతో వీరు కుమ్మక్కై, ప్రభుత్వ స్థలాల్లో కూడా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి, అమాయక ప్రజలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగానే వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుల ఇళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.

# సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో నిరాశ

**అమరావతి,:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టం కేసుకు సంబంధించి మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం తక్షణమే ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. సజ్జల భార్గవ్‌రెడ్డి తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి మధ్యంతర బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అయితే, భార్గవ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేరని, అందువల్ల కేసును వాయిదా వేయాలని ఆయన తరపు న్యాయవాది ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, సీనియర్ న్యాయవాది వాదనల నిమిత్తం కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఇదే సమయంలో, ఇది ఎస్సీ, ఎస్టీ కేసు కాబట్టి ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సూచించింది. గతంలో ఈ కేసు విచారణ చేపట్టాలని సజ్జల భార్గవ్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఉన్నత న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టు తలుపు తట్టారు.

# మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి

మొదటి పేజి తరువాయి

ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల ఆటంకాలను అధిగమించి హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ, బీహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను పోలీసులు హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిలువరించారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినప్పటికీ, రాహుల్ గాంధీ పట్టువీడకుండా, పోలీసుల అడ్డంకులను దాటుకుని హాస్టల్‌లోకి ప్రవేశించారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని "డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్" (డబుల్ ఇంజిన్ మోసపూరిత ప్రభుత్వం) అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను ఉద్దేశించి రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. "నితీశ్ జీ, మోదీ జీ, ఆపగలిగితే ఆపండి. కులగణన తుఫాను సామాజిక న్యాయం, విద్య, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోంది," అని ఆయన హిందీలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. "బీహార్ పోలీసులు నన్ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కానీ వారు నన్ను ఆపలేకపోయారు, ఎందుకంటే మీ (మైనారిటీ వర్గం) శక్తి నన్ను కాపాడుతోంది. దేశంలో కులగణన చేపట్టాలని మేము ప్రధాని మోదీకి చెప్పాం. మీ ఒత్తిడి వల్లే ప్రధాని మోదీ కులగణన ప్రకటించారు. మీ ఒత్తిడికి భయపడి ఆయన రాజ్యాంగాన్ని నుదుటిపై పెట్టుకున్నారు. కానీ వారి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, మైనారిటీలకు వ్యతిరేకమైనది. ఇది అదానీ-అంబానీల ప్రభుత్వం, మీది కాదు," అని రాహుల్ గాంధీ ఆరోపించారు. "భారత్‌లో, బీహార్‌లో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, మీకు దక్కాల్సినవన్నీ అమలు చేస్తామని నేను హామీ ఇస్తున్నాను," అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ప్రశ్నిస్తూ, "బీహార్‌లోని ఎన్డీయే 'డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్' నన్ను అంబేద్కర్ హాస్టల్‌లో దళిత, వెనుకబడిన విద్యార్థులతో సంభాషించకుండా అడ్డుకుంటోంది. విద్యార్థులతో మాట్లాడడం ఎప్పటి నుంచి నేరంగా మారింది? నితీశ్ జీ, మీరు దేనికి భయపడుతున్నారు? బీహార్‌లో విద్య, సామాజిక న్యాయం పరిస్థితిని దాచిపెట్టాలనుకుంటున్నారా?" అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో నిలదీశారు. "భారతదేశం ప్రజాస్వామ్య దేశం, ఇది రాజ్యాంగం ద్వారా నడుస్తుంది, నియంతృత్వం ద్వారా కాదు! సామాజిక న్యాయం, విద్య కోసం మా గొంతును వినిపించకుండా ఎవరూ మమ్మల్ని ఆపలేరు," అని ఆయన మరో పోస్ట్‌లో పేర్కొన్నారు.

# కశ్మీర్‌లో రాజ్‌నాథ్ పర్యటన..

## పాక్ అణుభద్రతపై తీవ్ర ఆందోళన

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "వారు (ఉగ్రవాదులు) మన తలపై దాడి చేయడానికి ప్రయత్నించినప్పుడు, మనం వారి ఛాతీపై దెబ్బకొట్టి పెద్ద గాయం చేశాం. మన 'ఆపరేషన్ సిందూర్' నిస్సందేహంగా భారత్ చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక చర్య" అని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వీర సైనికులకు, ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన 26 మంది పౌరులకు ఆయన నివాళులర్పించారు. "సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని గుర్తించి నాశనం చేయాలనే లక్ష్యంతో ఉన్న ప్రతి భారతీయ సైనికుడు కన్న కల 'ఆపరేషన్ సిందూర్'. మత ప్రాతిపదికన అమాయక పౌరులను వేరుచేసి చంపడం ద్వారా మన సామాజిక ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి వారు ప్రయత్నించారు. వారి దురుద్దేశాల ఆధారంగా మనం వారిపై దాడి చేశాం" అని రాజ్‌నాథ్ వివరించారు. పాకిస్థాన్ అణు బెదిరింపులకు భారత్ లొంగిపోదని, ఉగ్రవాద లక్ష్యాలపై మనం చేసిన దాడులతో ఇది నిరూపితమైందని ఆయన అన్నారు. "పాకిస్థాన్ అణు కేంద్రాలను అంతర్జాతీయ సంస్థ స్వాధీనం చేసుకోవాల్సిన సమయం ఇది, తద్వారా వారి అణు బూటకం శాశ్వతంగా బయటపడుతుంది" అని డిమాండ్ చేశారు. మంచి ఉద్దేశాలు ఉన్నచోట శాంతి, శ్రేయస్సు ఉంటాయని, చెడు ఉద్దేశాలు ఉన్నచోట హింస, కష్టాలు తప్పవని స్వామి తులసీదాస్ 'రామచరితమానస్'లో చెప్పిన విషయాన్ని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. అలాగే, వ్యాధి సోకిన వ్యక్తికి తీపి పదార్థాలు తినిపించడం వల్ల నయం కాదని, కఠినమైన నివారణలు అవసరమని జాతీయ కవి రామ్‌ధారి సింగ్ దినకర్ చెప్పిన మాటలను ఉటంకించారు. "భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది, కానీ మన సార్వభౌమాధికారం, సమగ్రతకు సవాలు ఎదురైనప్పుడు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది" అని స్పష్టం చేశారు. తమ భూభాగాన్ని ఉగ్రవాదానికి ఉపయోగించనీయమని పాకిస్థాన్ అటల్ బిహారీ వాజ్‌పేయికి హామీ ఇచ్చిందని, కానీ ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదని రక్షణ మంత్రి విమర్శించారు. "సరిహద్దుల నుంచి ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలు జరగవనే హామీపైనే ప్రస్తుత ఒప్పందం ఆధారపడి ఉంది. మీ హృదయాల్లో, దేశంలోని ప్రతి ఒక్కరి హృదయంలో తీవ్ర ఆగ్రహం ఉందని నాకు తెలుసు. ఆ ఆగ్రహం మిమ్మల్ని అధిగమించకుండా చూసుకున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. అమాయక పౌరుల హత్యలకు సరైన లక్ష్యాలను ఛేదించడం ద్వారా మీరు ప్రతీకారం తీర్చుకున్నారు" అని సైనికులను ఉద్దేశించి అన్నారు."ఈ రోజు పాకిస్థాన్ ఎక్కడికి చేరింది? పాకిస్థాన్ నిలబడిన చోటు నుంచే బిచ్చగాళ్ల వరుస ప్రారంభమవుతుందని అంటారు. ఐఎంఎఫ్ రుణం కోసం వారు అడుక్కున్నారు, పేద దేశాలకు ఇవ్వడానికి ఐఎంఎఫ్‌కు నిధులు ఇచ్చే దేశాలలో భారత్ ఒకటి" అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. "మన దేశంలో ఏదైనా ఉగ్రదాడి జరిగితే మన ప్రతీకారం, సందేశం చాలా దూరం వెళ్తుంది. ఉగ్రవాదంపై దేశం స్పందించే తీరును ప్రధానమంత్రి ఇప్పటికే పునర్నిర్వచించారు. ఒక కొత్త సాధారణ పరిస్థితి (న్యూ నార్మల్) సృష్టించబడింది, భారత్‌లో ఉగ్రదాడి జరిగినప్పుడల్లా దీనిని ఆశ్రయిస్తాం" అని ఆయన నొక్కిచెప్పారు. ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవని ప్రధాని మోదీ స్పష్టం చేశారని, పాకిస్థాన్‌తో చర్చలు కేవలం పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) గురించి మాత్రమే ఉంటాయని రక్షణ మంత్రి పునరుద్ఘాటించారు. దేశానికి గర్వకారణంగా నిలిచిన వీర సైనికుల మధ్య ఉండటం తనకు సంతృప్తికరమైన అనుభవమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నార్తర్న్ కమాండ్ జీఓసీ-ఇన్-సీ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ, 15 కార్ప్స్ జీఓసీ లెఫ్టినెంట్ జనరల్ ప్రశాంత్ శ్రీవాస్తవ, ఇతర సీనియర్ ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

# సీఈ రమణారెడ్డికి సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్!



నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ, పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్) సమస్యలు పూర్తిగా పరిష్కారమై, పంపుహౌస్‌ల పనులు ప్రారంభమైన తర్వాతే పైపులకు సంబంధించిన బిల్లులు సమర్పించాలని మహబూబ్‌నగర్ సీఈకి ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. గతంలో జరిగిన పొరపాట్లను ప్రస్తావిస్తూ, అలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణంలో అక్రమాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నమోదు చేసిన కేసుల్లో సంబంధం ఉన్న వారిపై చర్యలు కచ్చితంగా ఉంటాయని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అయితే, ఈ కేసులతో ఎలాంటి సంబంధం లేని అధికారులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ప్రాజెక్టుల నిర్మాణంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఒకటి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన పొరపాట్ల వల్ల విజిలెన్స్ కేసులు నమోదవుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో అలాంటివి జరగకుండా బాధ్యతగా పనిచేయాలని అధికారులకు ఉద్బోధించినట్లు సమాచారం. సమావేశంలో ఒప్పంద సేవల ఉద్యోగుల వేతనాల అంశాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, అవసరం ఉన్నంత వరకే కాంట్రాక్టు సిబ్బందిని నియమించుకోవాలని, దీనిపై ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ ప్రతిపాదనలు అందిన తర్వాత పరిశీలిస్తామని సీఎం చెప్పినట్లు తెలిసింది. ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల (ఓ అండ్ ఎం) కోసం పెండింగ్‌లో ఉన్న బిల్లులకు నెలకు రూ.50 కోట్లు, నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ. 75 కోట్ల వరకు కేటాయింపులు చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం. శిక్షణ సంస్థ వాలంతరికి రూ.10 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులకు రూ.10 కోట్లు, దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తికి రూ.2 వేల కోట్లు అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిసింది.

# జూన్ 21న విశాఖకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

మొదటి పేజి తరువాయి

సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ సంబంధిత శాఖల అధికారులతో ప్రాథమికంగా సమీక్ష నిర్వహించారు. మే 2న ప్రధాని అమరావతికి వచ్చినపుడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విశాఖపట్నంలో నిర్వహించాలని, ఆ వేడుకలకు తాను హాజరవుతానని సభా వేదిక నుండి ప్రకటించారు. అందుకు అనుగుణంగా జూన్ 21న విశాఖలో "Yoga for One Earth, One Health" అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన తెచ్చేందుకు ఇప్పటికే మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా గత మార్చి 13 నుండి జూన్ 21 వరకు 100 రోజుల్లో 100 నగరాల్లో 100 ఆర్గనైజేషన్ల పేరిట గ్లోబల్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర-2025" నినాదంతో ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా ఫౌండేషన్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల భాగస్వామ్యంతో సుమారు 2 లక్షల మందితో రాష్ట్ర ప్రభుత్వం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ మాట్లాడుతూ విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందని అన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబును ప్రభుత్వం నోడల్ అధికారిగా నియమించిందని తెలిపారు. కావున ఇప్పటి నుండే ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 8వ తరగతి నుండి డిగ్రీ, పిజి చదివే విద్యార్థులు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్ మిషన్ ప్రతినిధులు, యోగా శిక్షకులు, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్లు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్లు, పిఇటిలు, స్పోర్ట్స్ కోచ్‌లు, విశాఖలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సిఎస్ విజయానంద్ సూచించారు. ఈ సమావేశానికి ఢిల్లీ నుండి వర్చువల్‌గా పాల్గొన్న కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను ఖరారు చేస్తామని, రెండు లక్షల టి షర్టులు, యోగా మ్యాట్లను రాష్ట్రానికి పంపనున్నట్టు చెప్పారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి యంటి కృష్ణబాబు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వేడుకల్లో సుమారు రెండు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ త్వరలో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను ఖరారు చేయనుందని చెప్పారు. విశాఖలో ఈ ఈవెంట్‌ను ఎక్కడ నిర్వహించాలనేది ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు. అలాగే పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, విద్య శాఖ కార్యదర్శి కె శశిధర్, సిఆర్డిఏ కమీషనర్ కె కన్నబాబు, ఐటి శాఖ కార్యదర్శి కె. భాస్కర్, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి వినయ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీనది పుష్కరస్నానమాచరించిన

# సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

మొదటి పేజి తరువాయి




పుష్కరస్నానమాచరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. ఇవాళ వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు.

సరస్వతి నవరత్న మాల హారతి

ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది.


# ఏపీలో 19 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం..

మొదటి పేజి తరువాయి



దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం లభించింది. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలకు సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకువచ్చాయి.రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు సంబంధించి... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టూరిజం సెక్టార్‌లో హొటళ్లు, గదుల కొరత ఉందన్న ముఖ్యమంత్రి.. పెద్దఎత్తున హొటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని వ్యాఖ్యానించారు. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. హొటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారని వెల్లడించారు.

## జగజ్జనని రేణుక ఎల్లమాంబ అమ్మవారికి ఘనంగా బోనాలు



సిద్ధవటం, మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని మాచుపల్లి వెలసిన శ్రీ శ్రీ శ్రీ జగజ్జనని ఎల్లమాంబ అమ్మవారికి గురువారం మాచు పల్లె మహిళా భక్తులు భారీగా బోనాలు ఏర్పాటు చేశారు అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమాంబ అమ్మవారికి భక్తులందరూ మాచు పల్లె నలుమూలల గ్రామాల నుండి.జిల్లా వాసులు కూడా అమ్మవారికి భారీగా మొక్కులు చెల్లించు కున్నారు. బంధువులు కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకుని తిరుణాలకు అందరూ హాజరయ్యారు మాచుపల్లి గ్రామంలోని అందరి గృహాలలో బంధువులతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం లోగ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ 75వ జన్మదినవేడుకలు.




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ 75వ జన్మదిన సందర్భంగా నంద్యాల పట్టణం రైతునగరం సమీపంలో ఉన్న ప్రతిభ ఓల్డ్ ఏజ్ హోం నందు పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వాహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి.ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి 75 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించడంతోపాటు, ఆ పరమేశ్వరుడు మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాలి అని కోరారు.ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీనియర్ జర్నలిస్ట్ జయప్రకాష్ నారాయణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.శరత్ బాబు,జిల్లా అధ్యక్షులు సిఎం.శ్రీనివాసులు,జాతీయ కార్యదర్శి యలనాటి జాషువా,సభ్యులు రాజు,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్...

ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర"(శుభోదయం న్యూస్): ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి







ప్రధాన ధ్యేయం!గ్రామీణ ప్రాంతాలకూ ఉత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యం. సాంకేతిక పరిజ్ఞానంతో శాఖల సామర్థ్యాన్ని పెంచాలి.ఉద్యోగులు సేవా దృక్పథంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది – ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్. అమరావతి, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కానున్న సందర్భంగా గురువారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖలో సేవల పురోగతి, భవిష్యత్ ప్రణాళికల పై సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు మరియు ఇతర శాఖల సిబ్బంది సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ఏడాది కాలంలో ప్రభుత్వం, ఆరోగ్య రంగంలో అనేక కీలక మార్పులు తీసుకురాగా, ప్రజలకు సమర్థవంతమైన ఆరోగ్య సేవలందించేందుకు పలు సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి, వైద్య సదుపాయాలను గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తేవడంతో ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ముందు సాగే దిశగా శాఖల పనితీరును సమీక్షించడం, లోపాలను గుర్తించి పరిష్కార మార్గాలు సిద్ధం చేయడం, ప్రతి ఉద్యోగి తన విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరమని మంత్రి స్పష్టం చేశారు. అలాగే, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శాఖల సామర్థ్యాన్ని పెంచడం, కొలతకు లోబడి ఉండే లక్ష్యాలను నిర్ధేశించడం, ఉత్తమ కార్యకలాపాల ప్రకటన ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరాన్ని ఆయన హితవు పలికారు. ప్రజల ఆరోగ్యం మన ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత. నూతన ఆలోచనలు, ఉత్తమ పద్ధతులను తీసుకురావడం ద్వారా ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు సాధించగలము. ప్రతి ఉద్యోగి ప్రజల పట్ల సేవా దృక్పథంతో పనిచేయాలి, అని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా రాష్ట్ర ఆరోగ్య శాఖ మరింత సమర్థవంతమైన కార్యాచరణకు దిశానిర్దేశం చేసినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ఆరోగ్య సేవలను మరింత విస్తృతంగా, నాణ్యమైన స్థాయిలో అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం



పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ శీనివాసరావు (శుభోదయం న్యూస్): పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డు నందు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (గుంటూరు జిల్లాలోని "బెల్లంకొండ-పిడుగురాళ్ళ రైల్వే కి మీ 73/0-1" మరియు "జూలకల్లు-పిడుగురాళ్ళ రహదారి కి.మి 10/340 వద్ద" నెం.64 బదులుగా రోడ్డు ఓవర్ బ్రిడ్జి (%=.ా.దీ%)) నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీ పి అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ శ్రీ సూరజ్ గనోరే గారు, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు గారు, గురజాల శాసనసభ్యులు శ్రీ యరపతినేని శ్రీనివాసరావు గారు, యువ నాయకులు యరపతినేని నిఖిల్ గారు, నాయకులు మరియు సంబంధిత అధికారులు పాల్గొనడం జరిగింది.

## పోరాడితేనే కార్మికులకు న్యాయం..



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) :గత శతాబ్ది కాలంగా కార్మిక వర్గం సాధించుకున్న, కార్మిక అనుకూల చట్టాలన్నీ రద్దుచేసి, నాలుగు కార్మిక కోడ్లు ప్రవేశపెట్టి వాటిని నిర్బంధంగా అమలు జరపాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అల్లాపురం గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 20వ తేదీన జరిగే కార్మికుల సమ్మె లో ఉపాధి కూలీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు చట్టాల రద్దు కోసం ఢిల్లీలో జరిగిన పోరాటంలో కార్మిక వర్గం మనకు మద్దతు ఇచ్చిందన్నారు. నేడు పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు రెండింటిని కార్పొరేట్ కంపెనీల హస్తగతం చేయచూస్తుందన్నారు. దేశంలోని అన్ని ట్రేడ్ యూనియన్లు మే 20న కార్మిక సమ్మెకు పిలుపునిచ్చాయని, అదే రోజు గన్నవరం మండలంలో రైతులను, కౌలు రైతులను సమీకరించి ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు.కౌలు దారుల సంఘం నాయకులు మండల ఏసుదాసు మాట్లాడుతూ... విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఉప సంహరించాలన్నారు.నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయాలని,ఆక్వా, సాల్ట్(ఉప్పు) రైతులను ఆదుకోవాలన్నారు. చెరకు కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి నుండి కేటాయించి, మినుములు క్వింటా 9వేల రూపాయలకు కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.పాల రైతులకు లీటరుకు 10 రూపాయలు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. జిల్లాలో ఉన్న వేలాది ఎకరాల చుక్కల భూములు 22 ఏ లో పెట్టిన నిషేధ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేయాలని విన్నవిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కళ్ళం రాంబాబు, మిరప నాగేశ్వరరావు, ఆంతోని తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వెంకట్రావ్ చొరవతో మురుగు సమస్య కు మోక్షం



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవ తో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పలు సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మురుగు కాలువ పూడికతీత సమస్యకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో మోక్షం లభించింది. గన్నవరం మండలం కేసరపల్లి శివారు దుర్గాపురం లో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య వెంటాడుతూ ఉంది. హెచ్ సి ఎల్ గోడను ఆనుకుని ఉన్న ప్రధాన డ్రైన్ పూడిక తీయకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు దుర్గపురం కాలనీ జలమయమయ్యేది. ఇటీవల గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో దుర్గాపురం వాసులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి తమ కాలనీలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రధానంగా డ్రైనేజీ పూడిక తీయించి ముంపు నుండి రక్షించాలని వేడుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తక్షణమే డ్రైనేజీ పూడికి తీత పనులు చేపట్టాలని, పనులు పూర్తి చేసి తనకు ఫోటోలు పెట్టాలని గ్రామపంచాయతీ సిబ్బంది ని ఆదేశించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాల మేరకు గన్నవరం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రంగంలోకి దిగి డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టి రెండు రోజులుగా శరవేగంగా పనులు చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా మరుగున పడిన మురుగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళగానే స్పందించి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కు దుర్గాపురం కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ సమస్య పూర్తిస్థాయి పరిష్కారం గా ఈ కచ్చా డ్రైన్ ను పక్కా డ్రైన్ గా నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మల్లవల్లి పారిశ్రామిక వాడలో మౌలిక వసతుల కల్పనకు కృషి యార్లగడ్డ






గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని మల్లవల్లి గ్రామంలో లోని మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో మౌలిక వస్తువులు కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బుధవారం రాత్రి పారిశ్రామిక వాడలోని హరిత ట్రాన్స్ఫార్మర్ ను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ఫార్మర్లు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన యార్లగడ్డ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు గొట్టుముక్కల రవికుమార్ మాట్లాడుతూ ఈ పారిశ్రామికవాడలో విద్యుత్ అవాంతరాలను నివారించటానికి 220 కే.వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం అత్యవసరమని, గతంలో సబ్ స్టేషన్ మంజూరైనప్పటికీ ఏపీఐఐసీ భూమిని కేటాయించకపోవడంతో నిర్మాణం ఆగిపోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. పారిశ్రామిక వాడ పక్క నుంచి విద్యుత్తు లైన్ ఉన్నందున ప్రభుత్వానికి ఖర్చు తక్కువ అవుతుందని కేవలం ఐదు ఎకరాలు భూమి కేటాయిస్తే సబ్ స్టేషన్ నిర్మించుకోవడానికి వీలవుతుందని తెలిపారు. ప్రస్తుతం 4 వేల మంది కార్మికులు ఈ పారిశ్రామిక వాడలో పనిచేస్తున్నప్పటికీ సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇంత పెద్ద పారిశ్రామిక వాడలో ఏపీఐఐసీ పరిపాలన భవనాన్ని కూడా నిర్మించకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా ఇక్కడ పోలీస్ అవుట్ పోస్ట్, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. వీరి సమస్యలను సావధానంగా విన్న యార్లగడ్డ ఈ సమస్యలన్నిటి పరిష్కారానికి పాటుపడతానని అవసరమైతే అసోసియేషన్ ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి మురళీధర్, కార్యదర్శి ఫణీంద్ర కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ లైన్ల మరమ్మతులు





గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ నుండి రైతుల వ్యవసాయ భూముల మీదుగా పెనమలూరు వెళ్లే డొంక రోడ్లో విద్యుత్ స్తంభాలు పక్కకి ఒరిగిపోయి కూలిపోయే స్థితికి చేరగా విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాద భరితంగా మారాయి. దీంతో ఈ డొంక రోడ్ల ప్రయాణించే రైతులు ప్రాణాల అరచేతిలో పెట్టుకొని ప్రాణ భయంతో రాకపోకలు సాగిస్తున్నారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న ఈ విద్యుత్ తీగల సమస్య ను రైతులు ఎమ్మెల్యే యార్లగడ్డ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఈ విద్యుత్ లైన్లను మరమ్మత్తులు చేసి వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. యార్లగడ్డ ఆదేశాల మేరకు గురువారం ఉదయం రంగంలో దిగిన విద్యుత్ శాఖ అధికారులు తమ సిబ్బందితో కలిసి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టి విద్యుత్ తీగలను సరి చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు రైతులు, ప్రజలు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎల్లమాంబ ఆశీస్సులతో ప్రతిభ సాధించిన వృషభ రాజులు




సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని మాచుపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ జగజ్జనని ఎల్లమాంబ తిరుణాల ఉత్సవాల సందర్భంగా వృషభ రాజులచే బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి ప్రతిభ సాధించిన దోర్నాల గురివిరెడ్డి కన్నవారిపల్లి ఒక్క లక్ష 116 రూపాయలు మొదటి బహుమతిని సాధించారు రెండో బహుమతి రాంగోపాల్ రెడ్డి వైఎంఆర్ కాలనీ 70 వేల 116 ప్రొద్దుటూరు మూడవ బహుమతి దోర్నాల గురివి రెడ్డి వైఎంఆర్ కాలనీ 50వేల 116 రూపాయలు కమలాపురం అలాగే మూడు నాలుగు ఐదు బహుమతులు కూడా సాధించుకున్నారు బండలాగుడు పోటీల అనంతరం అమ్మవారి ఆలయం సమక్షంలో వృషభ రాజుల యజమానులకు మాచుపల్లి గ్రామ పెద్దలు నగదును అందజేశారు ఈ కార్యక్రమంలో బండలాగుడు పోటీలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా సిద్ధవటం ఎస్సై మహమ్మద్ రఫీ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి బండలాగుడు పోటీలను కట్టుదిట్టంగా జరిగేటట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాచుపల్లి గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో బండలాగుడు పోటీలు తొలగించేందుకు వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు కార్పోరేట్ వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, ఆసుపత్రి అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని, 600 పడకలకు ఏర్పాటు చేస్తామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.గురువారం సాయంత్రం నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రతి పేసెంట్ ను కర్నూలు జిజి హెచ్ కు రెఫర్ చేయవద్దని ఆసుపత్రి సూపరేంటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరీ కి ఎంపీ సూచించారు. గుండె సంబంధిత వ్యాధులు, కాన్సర్ , తదితర రోగులకు ఇక్కడే మంచి వైద్యం అందాలని చెప్పారు. ప్రతి పరీక్షలు ఆసుపత్రిలోనే చేయాలని, బయటకు వ్రాయవద్దన్నారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య మెరుగుదలకు, ఆసుపత్రి కి వచ్చిన మహిళలు కు విశ్రాంతి తీసుకునేందుకు నూతన గది నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకుందాం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు. ఎంపీ వెంట ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏ డి మస్తాన్, డాక్టర్ సలీమున్నిసా, సెంట్రల్ సివిల్ సప్లయ్ మెంబర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి,, జోనల్ రైల్వే వినియోగదారుల కన్సటెంట్ కమిటీ మెంబెర్ వెంకటరంగయ్య, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ సభ్యులు పెరుమాళ్ళ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దశరదాచారి జన్మదిన వేడుకలు బిసి విభాగం, తెలుగుదేశం పార్టీ



శ్రీకాళహస్తి ,రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్)ఎన్నో కష్టనష్టాలకు ఎదురొడ్డి నిలబడి, గత వైసిపి అరాచకాలకు వ్యతిరేకంగా నిబద్ధతతో పోరాడిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు దసరదాచారి తెలుగు తమ్ముళ్ళు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు తెలిపారు.తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రతీ ఒక్క కార్యకర్తను తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి, అందరినీ సమన్వయ పరచే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈరోజు స్థానిక పూసల వీధి కూడలిలో అతని చేతుల మీదుగా కేక్ కట్ చేయించి, దుశ్శాలువాతో తెలుగు తమ్ముళ్ళు ఘనంగా సత్కరించారు.తెలుగుదేశం పార్టీలో ప్రతీ ఒక్కరూ సమన్వయంతో ముందుకు వెళ్ళి, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రెడ్డివారి గురవారెడ్డి, మిన్నల్ రవి, గాలి మురళి నాయుడు, గుర్రప్పశెట్టి, లక్కమనేని మధుబాబు, డా.నివేదిత మోరె, డా.యం.ఉమేష్ రావు, కాసరం రమేష్, పేట బాలాజీ రెడ్డి, డి.వి.నారాయణ, వజ్రం కిషోర్, మునిరాజా యాదవ్, అద్దంకి కిట్టు, కోట చంద్రశేఖర్, భాస్కర్, సయ్యద్ చాంద్ బాషా, మహబూబ్ బాషా, కన్నావరం హరిబాబు, లక్ష్మణ్, మణికంఠ, వెంకటేశ్వర్లు, వెంకటేష్, భగత్, సంజాకుల మురళీకృష్ణ, రియాజ్, జమీర్, ప్రభాకర్, రాకేష్, సులేమాన్, చలపతి, కృష్ణయ్య, కన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి ఐఐటీలో... రానున్నాయ్ మరిన్ని 'ఇన్నోవేషన్స్'

### ఫేజ్-2కు రూ. 2313 కోట్ల బడ్జెట్

### మరో 30 ఏళ్లలో 15 వేల సీట్లు

### డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : రానున్న రోజుల్లో తిరుపతి ఐఐటీ మరిన్ని నూతనావిష్కరణలకు కేంద్ర బిందువు కానుందని ఆ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. పరిశ్రమలు-విద్యా సంస్థల మధ్య అను సంధానం పెంచేందుకు, విద్యార్థులు మెరుగైన పరిశోధనలు చేసేందుకు వీలుగా అత్యాధునిక రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఏర్పేడులో ఉన్న తిరుపతి ఐఐటీలో డైరెక్టర్ సత్యనారాయణ గురువారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలను మౌళిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఇందులో భాగంగా ఐదు నూతన ఐఐటీలకు బడ్జెట్లో సుమారు రూ. 13 వేల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. తిరుపతి ఐఐటికి రెండో దశ నిర్మాణ పనులకు గాను నాలుగేళ్ల పరిమితికి(2025-29) రూ.2313 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో దశ ఐఐటి నిర్మాణ పనులు పూర్తయితే ఇప్పుడున్న 1200 సీట్లకు అదనంగా మరో 1300 మంది విద్యార్థులకు ఇక్కడ చదువుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. అంతిమంగా మరో 30 ఏళ్లలో 15 వేల మంది విద్యార్థులు ఒకేసారి ఐఐటి కోర్సులు పూర్తిచేసేలా వసతులు కల్పించనున్నామని స్పష్టం చేశారు. ఐఐటీలో ప్రస్తుతం 317 మంది పీహెచ్డీ విద్యార్థులు ఉండగా ఆ సంఖ్య 600కు పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పరిశ్రమలు-విద్యా సంస్థల మధ్య అను సంధానం పెంచి జాతికవసరమైన పరిశోధనలు చేసేందుకు ఐఐటికి చెందిన 19 ఎకరాల్లో ఇన్నోవేషన్ పార్క్, అత్యాధునిక మేకర్స్ ల్యాబోరేటరినీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఐసర్ సంస్థ కూడా ఇందులో భాగస్వామ్యం వహిస్తుందని చెప్పారు. కియా మోటార్స్ తో రూ. 35 కోట్ల ఒప్పందం, రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రం ఇందులో కీలకమైనవని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 230 జాతీయ మిషన్ కార్యక్రమాల్లో తిరుపతి ఐఐటీ భాగస్వామ్యం వహిస్తోందని వివరించారు. పల్లె నుంచి పట్టణం దాకా శాస్త్ర, సాంకేతిక రంగ ఫలాలు అందేందుకవసరమైన అన్ని కార్యక్రమాలను తిరుపతి ఐఐటి చేపడుతుందని డాక్టర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. పలు విభాగాల డీన్ లు శశిధర్ గుమ్మా, అనిల్ కుమార్, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి నియోజకవర్గ పట్టణ ప్రముఖులు, ప్రజలు,కార్యకర్తలు, నాయకులు ఎక్స్ ఎమ్మెల్యే ని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఉదయం శ్రీజ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని తన పుట్టినరోజు సందర్భంగా సతీ సమేతంగా దర్శించుకున్నారు.అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. తనకు జన్మదిన శు



భాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించడానికి విచ్చేసిన అందరికీ భోజన ఏర్పాట్లు చేసి అనంతరం వారితో కలిసి భోజనం చేశారు మాజీ శాసనసభ్యుల వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరూ తారక శ్రీనివాసులు,గుమ్మడి బాలకృష్ణయ్య,పగడాల రాజు, ఉత్తరాజి శరవణ కుమార్,మున్నా రాయల్, కంట ఉదయ్ కుమార్, జై శ్యామ్ రాయల్, శ్రీవారి సురేష్, సిరాజ్ భాష,పటాన్ ఫరీద్,గోరా,మధు రెడ్డి,వయ్యాల కృష్ణారెడ్డి,బ్రీ హేమ భూషణ్ రెడ్డి,బ్రీ సుదర్శన్ రెడ్డి, ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరీ కిషోర్ రెడ్డి,మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్,తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవ నాయుడు,ఎంపీపీ నిర్మలమ్మ,మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్య నాయుడు,సిద్ధగుంట సుధాకర్ రెడ్డి,తిరుమల రెడ్డి,రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్,ఎంపీపీ హరి ప్రసాదరెడ్డి, జడ్పీటీసీ సంధ్య రాణి, ప్రభాకర్, నగేష్,రసూల్ తదితర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## శ్రీకాళహస్తిలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ శ్రీమతి డొక్కా సీతమ్మ స్ఫూర్తి తో శ్రీకాళహస్తి పట్టణం లో ప్రతి గురువారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈరోజు 44 వ వారం బస్టాండ్ సెంటర్లో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జ్ పేట చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రవి కుమార్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి ,వెంకటరమణ యాదవ్, రిటైర్డ్ తహసిల్దార్ చంద్రశేఖర్ రావు, దినేష్,ముని కుమార్, నవీన్, దినేష్, రాజా, సాయి, ముని చంద్ర,వీర మహిళలు,శారద, రాజ్యలక్ష్మి, గాయత్రి ,బత్తేమ్మ, పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లేకపోతే దళిత పేద వర్గాలు లేరు : ఉప్పాల మురళి గౌడ్




బాపట్ల, (శుభోదయం న్యూస్) : దళిత రత్న అంటరానితన పోరాట సమితి వ్యవస్థాపకులు డాక్టర్ జి చార్వాక ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్ మాట్లాడుతూ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలను కలుపుకొని ప్రతి కార్యక్రమం కూడా ఎంతో అద్భుతంగా చేస్తున్న చార్వాక అన్నకి ధన్యవాదాలు తెలిపారు, అంబేద్కర్ ఆశయాలను నేటి యువతకు తెలియపరుస్తూ ఎక్కడ అన్యాయం జరిగినా నేనున్నానంటూ సహాయ సహకారాలకి ముందుంటున్న చార్వాక అన్న ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బిసి ఎస్సి ఎస్టి మైనార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ప్రాధాన్యం - హరీష్ బాబు...







ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్): ధర్మవరం పట్టణంలో నిన్న అర్ధరాత్రి సమయంలో కురిసిన అకాల భారీ వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు మరియు ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తక్షణం మునిసిపల్ అధికారులను మరియు తన కార్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు, గురువారం ఉదయం మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరిష్ బాబు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మరియు మునిసిపల్ సిబ్బందితో కలిసి ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు.వెంటనే పారిశుద్ధ కార్మికులతో, ట్రాక్టర్లు, మరియు జెసిబిల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, నీటిని పారదోలారు. ఈ సందర్భంగా హరిష్ బాబు మాట్లాడుతూ, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ప్రాధాన్యంగా కొనసాగుతున్నది. వర్షపు నీటి కారణంగా ఎక్కడా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. మునిసిపల్ సిబ్బంది, పౌరులు సమన్వయంతో సహకరిస్తే ఈ విధమైన సమస్యలను త్వరగా అధిగమించగలం అని తెలిపారు.

## అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి ఉంటాం బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్



బాపట్ల జిల్లా, (శుభోదయం న్యూస్) : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులు: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపకులు డాక్టర్ చార్వాక బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా అధ్యక్షులు ఉప్పాల మురళి గౌడ్, గిరిజనుల హక్కుల పోరాట సమితి టిడిపి నాయకులు తిరువీధుల శంకర ప్రసాద్ బిసి ఎస్సి ఎస్టి మైనార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు,

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ముగింపు సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చార్వాక




(శుభోదయం న్యూస్) బాపట్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ముగింపు సభ విజయవంతం చేసిన బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులకు ప్రజలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్న దళితరత్న ముద్దుబిడ్డ అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపకులు డాక్టర్ జి చార్వాక బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులు,

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం




తెలంగాణ స్టేట్ బ్యూరో,దొమ్మాటి శివకుమార్,(శుభోదయం న్యూస్) మే 15:సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని వార్డ్ 8 బొల్లారంలో కళాసిగూడ లో ఎస్ డి ఎఫ్ నిధులు రూపాయిలు 32 లక్షలతో చేపట్టనున్న సి సి రోడ్డు నిర్మాణ పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మదా మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో డ్రైనేజ్ నిర్మాణ పనులకు రూపాయిలు 8 కోట్లతో ఒక సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నట్లు వారు తెలిపారు.రాబోయే వారం రోజుల్లో ఈ పనులను కంటోన్మెంట్ వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు తెలుపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి,వార్డ్ 8 బీజేపీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ పింజర, బిజెపి సీనియర్ నాయకులు ధనుంజయ చారి, జె వి నర్సింగ్ రావు,జైనపల్లి శ్రీకాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.ఫోటో రైటప్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్

## సీబీఎస్సీ బోర్డు పరీక్షల్లో పల్లవి మోడల్ స్కూల్లో అద్భుత ఫలితాలు..




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివ కుమార్,(శుభోదయం న్యూస్) మే 15:బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు 12,10 తరగతి బోర్డు పరీక్షలలో (2024%-%25) మరోసారి 100% ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు ఎస్ఎస్సీఈ, ఎస్ఎస్ఈ పరీక్షలలో విద్యార్థుల పట్టుదల, నిబద్ధతతో మంచి ఫలితాలు సాధించిన 12,10 తరగతి విద్యార్థులందరికీ పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలిపింది. విద్యా పనితీరును మెరుగుపరచడానికి తమతో సహకరించినందుకు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కూడా యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. 12వ తరగతికి, సైన్స్ విభాగంలో వివాన్ శంకర్ ధావన్ 95.4% మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారు. వాణిజ్య విభాగంలో స్వాతి మహేష్ 95.2% మార్కులతో ఆకట్టుకున్నారు.11వ తరగతికి, బొడ్డుపల్లి అక్షర 97% మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.ఈ అద్భుతమైన ఫలితాలు ఛైర్మన్ శ్రీ మల్కా కొమరయ్య, సీఓఓ శ్రీ యశస్వి, ప్రిన్సిపాల్ శ్రీమతి రేణు చక్రవర్తి, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనంగా నిలిచాయి.

## గణం వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రతుపల్లి యాదయ్య



సంస్థాన్ నారాయణపురం మే 15 (శుభోదయం న్యూస్): సంస్థాన్ నారాయణపురం కొత్తగూడెం గ్రామానికి చెందిన గణం గాలయ్య కుమారుడు గణం నరసింహ-లక్ష్మీ నూతన దంపతుల వివాహ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిసి మండల అధ్యక్షులు రతుపెల్లి యాదయ్య యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు అందే నరేష్ యాదవ్ నయా తెలంగాణ రిపోర్టర్ సోనబోయిన కృష్ణకుమార్ గణం లింగస్వామి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ తో సంబంధం లేదు మొగుదాల రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ నాయకులు



చౌటుప్పల్ మే 15 (శుభోదయం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువవికాసం పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు జూన్ 2 నుంచి కేటగిరీని బట్టి రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక సాయం మంజూరు చేస్తామని పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే పేద ప్రజల ప్రభుత్వమని ఇచ్చిన ప్రతి హామీ నెరవేరస్తుందని మొగుదాల రమేష్ గౌడ్ అన్నారు.

## రామగుండం నగరపాలక సంస్థలో ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావులేదు.

# నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ




రామగుండం మండలం, రిపోర్టర్-తిరుపతి, (శుభోదయం న్యూస్): ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా రామగుండం నగరపాలక సంస్థ అన్ని సేవలు అందిస్తున్నదని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. నిర్ణీత వ్యవధిలోనే ఫిర్యాదుల పరిష్కారం , ధృవీకరణ పత్రాల జారీ తదితర అన్ని రకాల సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. నగర పాలక సంస్థ అధికారులు , సిబ్బంది నిజాయితీ గా , సమర్ధవంతంగా సేవలందిస్తున్నప్పటికీ ఏమైనా లోపాలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 , మొబైల్ నెంబర్ 9440446106 అందరికీ తెలిసేలా తన ఆదేశాల మేరకు కార్యాలయం లో పలు చోట్ల నగర పాలక సంస్థ ఆద్వర్యంలోనే బోర్డులు ఏర్పాటు చేయించడం జరిగిందని అన్నారు. నగర పౌరులకు సుపరిపాలన పాలన అందించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## మెగా జాబ్ మేళాకు సంబంధించిన వివరాలు అధికారికంగా ప్రకటించిన రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్.



రామగుండం, మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం రోజున ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేసిన ప్రకారం, మే 18, 2025 తేదీన గోదావరిఖనిలోని జనహారపరల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించనున్న "మెగా జాబ్ మేళా"కి సంబంధించిన వివరాలు అధికారికంగా విడుదల చేశారు.ఈ కార్యక్రమం నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంప్లాయ్మెంట్ అసోసియేషన్ మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ మేళాలో 100కి పైగా ప్రఖ్యాత సంస్థలు పాల్గొంటుండగా, సుమారు 3000కి పైగా ఖాళీ ఉద్యోగాల భర్తీకి అవకాశాలు కల్పించబడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా,



ఐటీఐ తదితర అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. నిరుద్యోగ సమస్యతో బాధపడుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ భవిష్యత్తు బలోపేతానికి ఈ జాబ్ మేళా వేదిక కావాలని ఎమ్మెల్యే గారు ఆకాంక్షించారు.అంతేగాక, జిల్లా, మండల స్థాయిల నుండి వేలాది మంది యువత పాల్గొననున్న ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అన్ని వర్గాల నిరుద్యోగులు తమ బయో డేటా, అర్హత సర్టిఫికెట్లు మరియు ఆధార్ కార్డు వంటి అవసరమైన పత్రాలతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.మరింత సమాచారం కోసం హెల్ప్ లైన్ నంబర్లు 9491144252, 9948377353 ను సంప్రదించాలని సూచించారు.

## రామగుండం కార్పొరేషన్ లో వివిధ ప్రాంతాలలో పలు సమస్యలను, అభివృద్ధి పనులను పరిశీలించిన నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ.



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్): రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) అరుణ శ్రీ గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి పలు సమస్యలు , అభివృద్ధి పనులు పరిశీలించారు. రామగుండం పట్టణ ప్రధాన రహదారి లో తరచుగా నీళ్ళు నిలిచిపోతున్న ఉపరితల కాలువను పరిశీలించారు. ఈ కాలువ స్థానంలో మాస్టర్ ప్లాన్ కు లోబడి కొత్త కాలువ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు . ప్రక్కన నివాసితుల సౌకర్యార్ధ%శీ% వేరుగా భూగర్భ మురుగు నీటి కాలువ నిర్మించడానికి ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. రామగుండం లో నిరుపయోగంగా ఉన్న సీనియర్ సిటిజన్ హాల్ భవనం పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేసి దాన్ని ఉపయోగంలోకి



తీసుకురావల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం రామగుండం , మల్కాపూర్ లలో సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అవసరానికి తగ్గట్లుగా అప్ గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవేందర్ , ఎ ఇ మౌనిక , నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

## 'మెగా జాబ్ మేళా" కర పత్రాలను ఆవిష్కరించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్): సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో రామగుండం ఏరియా1,2 3 ఏరియా పెద్దపల్లి మరియు మంచిర్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు కోసం దాదాపుగా 100 పైగా కంపెనీలో, 3000పైచిలుకు ఉద్యోగాల కొరకు మెగా జాబ్ మేళా తేది.18-05-2025, ఆదివారం రోజున ఉదయం 8:00గంటల నుండి గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని ఇట్టి అవకాశన్ని నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని రామగుండం శాసనసభ్యులు గౌరవ శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష తెలియజేస్తూ ఇందుకు సంబంధించిన "మెగా జాబ్ మేళా" కర పత్రాలను ఆవిష్కరించడం జరిగింది. రామగుండం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇట్టి జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. నిరుద్యోగ యువత కు ఇది ఒక సువర్ణ అవకాశం అని ప్రతి ఒక్కరు కూడా దీన్ని సద్వినియోపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమలో ఆర్ జీ. 1 జిఎం శ్రీ లలిత్ కుమార్, ఆర్ జీ. 2 జిఎం బండి వెంకటయ్య, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, డిజియం ఎస్టేట్ కుమార్, ఎస్.సి సివిల్ వర ప్రసాద్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి. ప్రజాసంఘాలు, సింగరేణి కార్మికసంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ.



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): 15 మే, 2025, గురువారం సాయంత్రం, గోదావరిఖని, చౌరస్తాలో ప్రజాసంఘాలు మరియు సింగరేణి కార్తిక సంఘాల ఆధ్వర్యంలో శాంతిర్యాలీ జరిగింది కేంద్రప్రభుత్వం,మావోయిస్టుపార్టీతో,శాంతిచర్యలు జరపాలని ఛత్తీస్ ఘడ్ అటవీ ప్రాంతాలో అమలు చేస్తున్న కగార్ ఆపరేషన్ ను నిలిపివేయాలని, కాల్పుల విరమణ కేంద్ర ప్రకటించాలని, ఉద్దేశంతో ఈశాంతి ర్యాలీ గోదావరిఖని లో చౌరస్తా నుండి రీగల్ షూ మార్ట్ సెంటర్ వరకు లక్ష్మీ నగర్ కూడలి తిరుగుతూ చౌరస్తా వరకు శాంతి ర్యాలీ జరిగింది. ఆదివాసి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా



1జనవరి 2024 నుండి ప్రారంభించడం ఆపరేషన్ కగార్ తో ఇప్పటి వరకు 510 మంది ఆదివాసులు మావోయిస్టులు బూటకపు ఎన్ కౌంటర్ లు దాడులలో హత్యగా విభజించబడ్డారు.దేశవ్యాప్తంగా మేధావులు ప్రజాస్వామిక వాదులు వాదులు హక్కుల సంఘాలు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరిపాలనే డిమాండ్ మేరకు మొదటి మావోయిస్టులు మూడు లేఖల ద్వారా యూట్యూబ్ ఇంటర్వ్యూలో ద్వారా శాంతి చర్చలకు లేము సిద్ధమని ఆరు నెలల వరకు కాల్పుల విరమణ పాటిస్తున్నామని ప్రకటించారు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష టిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కూడా శాంతి చర్చల జరగాలని కేంద్రానికి లేఖలు రాస్తామని అన్నారు వామపక్షాలు గత నెలలుగా శాంతి చర్చలు జరగాలని డిమాండ్ చేస్తున్నారు కానీ బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించలేదు ఈ దేశవ్యాప్తం శాంతి చర్చలకు వస్తున్న ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ మేరకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు మావోయిస్టు పార్టీలలో జరపాలని గోదావరిఖనిలో ప్రజా సంఘాలు సింగరేణి కార్మిక సంఘాలు ఈ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆదివాసుల పోరాట సంఘ ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా మురి మడుగుల మల్లయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి పౌర హక్కుల సంఘం తెలంగాణ మాదన కుమారస్వామి, ఉప్పులేటి పర్వతాలు, గూడూరు లవన్ కుమార్, రత్నకుమార్, వేల్పుల కుమారస్వామి, ఎస్ సమ్మక్క, ఎస్.కె పహిముదా, లలిత, మహమ్మదీన్, రహీం, దుర్గం నగేష్, ముడిమడుగుల సురేష్, వై యాదయ్య, ఎం సురేష్, సిహెచ్ కృష్ణ కుమార్, ఐ కృష్ణ, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు ఈ నరేష్, కే విశ్వనాథం, ఎస్ రవీందర్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూత్పూర్ జలాశయం కింద ఎంత ఆయకట్టు కు నీళ్లు అందిస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సమాధానం చెప్పాలి

### మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి

: నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంపై మక్తల్ తొలి శాసనసభ్యులు చిట్టెం రాంమోహన్ రెడ్డి శుక్రవారం మక్తల్ లోని తన నివాసంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపిఓ రిపోర్టు ఫారెస్ట్ క్లియరెన్స్ ల్యాండ్ అక్విషన్ కృష్ణ బోర్డు నుండి కూడా ఎటువంటి అనుమతులు లేకుండా ఈరోజు బూత్పూర్ జలాశయం నుంచి కేవలం ఒక టిఎంసి విలువచేసే భూత్పూర్ జలాశయం నుండి కొడంగల్ కు నియోజకవర్గం నీళ్లు తీసుకుపోవడం ఇలాంటి అనుమతులు లేకుండా ముందుగానే కాంట్రాక్టర్ 100 కోట్ల బిల్లులకు పెట్టడానికి చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ఎంతో ఈ జిల్లా ప్రజలకు తెలుసని ఇప్పటికే భూత్పూర్ జలాశయం నుండి నీళ్లు తీసుకుపోవడం వల్ల నర్వ అమరచింత ఆత్మకూరు మండలాలు పొలాలు ఎడారిగా మారే అవకాశం ఉందని ఇప్పటికే భూత్పూర్ జలాశయం వద్ద నీళు ఏమాత్రం నిలువలేదని అటువంటి పరిస్థితుల్లో కొడంగల్ ప్రజలకు ఏ విధంగా సాగునీరుస్తారో చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమాలకు అవినీతికి తావు లేదు... ప్రజలకు నగరపాలక సంస్థ అన్ని సేవలు అందిస్తున్నది.....

: రామగుండం:మే 15. అక్రమాలకు , అవినీతికి ఎలాంటి తావు లేకుండా రామగుండం నగరపాలక సంస్థ అన్ని సేవలు అందిస్తున్నదని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు , కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. నిర్ణీత వ్యవధిలోనే ఫిర్యాదుల పరిష్కారం , ధృవీకరణ పత్రాల జారీ తదితర అన్ని రకాల సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. నగర పాలక సంస్థ అధికారులు , సిబ్బంది నిజాయితీ గా , సమర్ధవంతంగా సేవలందిస్తున్నప్పటికీ ఏమైనా లోపాలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 , మొబైల్ నెంబర్ 9440446106 అందరికీ తెలిసేలా తన ఆదేశాల

## అడ్రస్ లేని కాంట్రాక్టర్-గాలికి వదిలేసిన మున్సిపాలిటి..... ఎమ్మెల్యే తక్షణమే స్పందించాలని స్థానికుల అభ్యర్థన.....

రామగుండం: మే 15. రామగుండం కార్పొరేషన్ 31వ డివిజన్ లోని తాజా మాజీ కార్పొరేటర్ ఇంటి ప్రాంగణాన్ని ఆనుకొని ఉన్న మేదరి బస్తీ, రాంమందిర్ రోడ్ అనుసంధానం చేయబడిన ప్రధాన డ్రైనేజ్ గోడ, రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.సుమారు మూడు నెలల క్రితం ఈ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయకుండానే అడ్రస్ లేకుండా పోయాడు. నిత్యం ఈ దారి రద్దీగా ఉంటుంది. ఈ దారి వెంట వెళ్లే పాదాచారులు, వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. డ్రైనేజీ సైడ్ వాల్ కూడా పూర్తి చేయక చేయకపోవడంతో ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. గతంలో కూడా ఈ డ్రైనేజీని మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు కూడా సంభవించాయి. ఈ రోడ్డును పూర్తి చేయకపోవడంతో గత రాత్రి కురిసిన భారీ వర్షం వల్ల బురుదమయమైంది. డ్రైనేజ్ సైడ్ వాల్ కూడా పూర్తి చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది.ఈ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ పూర్తి చేయకుండా మధ్యలో వదిలేసి పోవడం, సంబంధిత అధికారులు పట్టించుకోక గాలికి వదిలివేయడంవల్ల పాదచారులు, వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాక ఈ పనులు నిలిచిపోవడంతో తీవ్ర దుర్గంధం కూడా వెదజల్లుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ డ్రైనేజీ కాలువ, రోడ్డు పనుల విషయంలో భారీ అవినీతి కూడా జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. త్వరలో వర్షాలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ పనులు పూర్తి చేయకపోతే స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున స్థానికులు భారీ ఆందోళనల కూడా చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.గత ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతానికి ప్రచారానికి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే కు ఈ రోడ్డు, డ్రైనేజీ దుస్థితి విషయమై విజ్ఞాపన చేయగా తాను ఎమ్మెల్యేగా గెలిస్తే పనులు తప్పక పూర్తి చేపిస్తానని హామీ ఇచ్చారు. దేవుడు వరమిచ్చినా, పూజారి కరుణించడు అన్న సామెతల ఈ ప్రాంత దుస్థితి నెలకొంది. ఈ విషయమై ఎమ్మెల్యే తక్షణమే స్పందించి సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకొని పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## చెరువు భూమిని క్రమబద్ధీకరించే అధికారం ప్రభుత్వానికి లేదు

హైదరాబాద్, మే 15: తెలంగాణ హైకోర్టు హైదరాబాద్ ప్రయత్నం. హైకోర్టు స్పష్టం చేసింది చెరువు ఎఫ్‌టీఎల్ భూములను క్రమబద్ధీకరించే అధికారం ప్రభుత్వానికి లేదని. బాధితుల వాదనలు విని, టైటిల్ పత్రాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించింది .

## సంపాదకీయం

### మన భద్రతా వ్యూహంలో.. కొత్త అధ్యాయం

ఉగ్రవాదంపై తన విధానాన్ని మరోసారి చాటి చెప్పి భారత్, ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఆపరేషన్ కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాక, కోట్లాది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచింది.'ఉగ్రవాదం, చర్చలు కలిసి ఉండలేవు. రక్తం, నీరు కలిసి పారవు, ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక సైనిక చర్య కాదు. ఇది భారత సైనిక పరా క్రమానికి ఒక కొత్త అధ్యాయం. ఉగ్రవాదంపై పోరాటంలో మైలురాయి చర్య' అని మోదీ స్పష్టంగా తెలిపారు. ఇది తాత్కాలిక చర్య కాదు.. దీని వెనుక ఉన్న విధాన మార్పే ప్రపంచం గమనించాల్సిన అంశం.ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడిలో అమాయక పౌరులు, తమ కుటుంబాల ఎదుటే హత్య చేయబడిన సంఘటన దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడిని కేవలం క్రూర నేరంగా కాకుండా, భారతీయ గౌరవం, సామరస్యం మీద జరిగిన కుట్రగా ప్రధాని మోదీ అభివర్ణించారు.

ఆపరేషన్ సిందూర్ గట్టి గుణపాఠం

ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా మే 6 - 7 తేదీలలో భారత సాయుధ దళాలు పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిక్షణా శిబిరాలపై ఖచ్చితమైన క్షిపణి, డ్రోన్ దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో దశాబ్దాలుగా భారత్‌కు ముప్పుగా ఉన్న 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ చర్య ఉగ్రవాద నిర్మూలనలో కీలక మలుపుగా నిలిచింది. భారత దాడులు పాకిస్తాన్‌ను కుదిపేశాయి. పాకిస్తాన్ సైనిక స్థావరాలు, వాయుసేన స్థావరాలు, నౌకాదళ ప్రధాన కేంద్రంపై నేరుగా దాడి చేయడం వారి మౌలిక సదుపాయాలను మాత్రమే కాక, మనో ధైర్యాన్ని కూడా ఛిన్నాభిన్నం చేసింది. బహవల్‌పూర్, మురిద్కే వంటి ప్రదేశాలు, గతంలో 911, లండన్ ట్యూబ్ దాడులు, ముంబయి ఉగ్రదాడులతో అనుసంధానించబడిన కేంద్రాలుగా ఉండగా, ఇప్పుడు భారత్‌కి సునాయాస లక్ష్యాలుగా మారాయి.

'మేడ్ ఇన్ ఇండియా' డిఫెన్స్ సుపర్బ్!

ఈ ఆపరేషన్ విజయానికి 'మేడ్ ఇన్ ఇండియా' రక్షణ పరికరాలు కీలకంగా నిలిచాయి. ఇది స్వదేశీ రక్షణ సామర్థ్యాలపై ప్రభుత్వ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఆధునిక డ్రోన్లు, ఖచ్చితమైన క్షిపణులు... ఇవన్నీ భారత్ త్రివిధ దళాల పోరాట పటిమకి ఆధునిక సాంకేతిక వినియోగానికి పరిపక్వతకు సంకేతాలు.. మన భద్రతా సిద్ధాంతంలో మూడు ప్రధాన మార్పులు చోటు చేసుకున్నాయి. అవి కఠినమైన ప్రతీకారం ఉగ్రవాదంపై భారతదేశం ఇక నిర్దయగా, నిర్దిష్టంగా ప్రతీకారం తీసుకుంటుంది. భారత్ అణు బెదిరింపులను లెక్కచేయదు.. దానికంటే ప్రాధాన్యం దేశ గౌరవం అని ఈ ఆపరేషన్ సిందూర్ నిరూపించింది.

స్కాల్ప్-ఇజి క్రూయిజ్ క్షిపణులు

భారత రాఫెల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించిన %బాజూూూా-జు+ (౯శీతీఏ నా్తుునశీష%) క్రూయిజ్ క్షిపణులు ఫ్రాన్స్, యూకే సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ ఖచ్చితత్వ దాడి ఆయుధం కొన్ని అత్యాధునిక లక్షణాలతో రూపొందించ బడింది. ఈ ఆయుధం రాడార్‌లకు చిక్కకుండా లక్ష్యాన్ని చేరు తుంది. భారీ కాంక్రీటు బంకర్లను ధ్వంసం చేయగల సత్తా కలిగి వుంది. శక్తివంతమైన వార్‌హెడ్ ఉండటంతో పాటు లక్ష్యాలను స్వయంగా గుర్తించగలదు. 250 కి.మీ పైగా ప్రయాణించగలదు, అంత దూరం ఉన్న లక్ష్యాలను ఇక్కడి నుండే దాడి చేయగలదు. ఈ క్షిపణులను ఉపయోగించి బహావల్పూర్, మురీద్కే వంటి ఉగ్ర స్థావరాలను అత్యంత ఖచ్చితంగా ధ్వంసం చేశాయి. అదే సమయంలో, భారత్, రష్యా కలిసి అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు కూడా ఉపయోగించబడ్డాయి. ఇవి ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణులలో ఒకటి. వీటిని కీలకమైన పాకిస్తాన్ మౌలిక సదుపాయాలను వేగంగా ధ్వంసం చేయడానికి వినియోగించారు.

గేమ్ చేంజర్ ఎస్- 400

ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఎస్-400 విస్తృతమైన రేంజ్‌ను కలిగి ఉంది. 600 కి.మీల దూరంలోని లక్ష్యాలను సైతం ఇది గుర్తించగలదు. 400 కిలోమీటర్ల వరకూ మిసైళ్లను ప్రయో గించి శత్రు దేశాలకు చెందిన యుద్ధ విమానాలు (%ఫ్-16, ఫ్%-35, సుఖోయ్-30), క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిసైళ్లు, డ్రోన్లు, ఇతర హానికర వాయుసేన వస్తువులను నాశనం చేయగలిగింది. దీని రియాక్షన్ టైమ్ కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల 5-10 సెకన్లలో కదులుతున్న టార్గెట్‌ను లాక్ చేసి నేల కూల్చగలిగింది. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఉన్న కీలకమైన సాంకేతిక అంశాలు ఏకకాలంలో 100 కంటే ఎక్కువ లక్ష్యాలను ట్రాక్ చేయగలదు. 4 రకాల మిసైళ్లతో విభిన్న రేంజ్‌లలో రక్షణ. లక్ష్యాన్ని 5-10 సెకన్లలో గుర్తించి తిప్పికొట్టే సామర్థ్యం. వాహనాలపై కదిలే విధంగా రూపొందించబడిన ఈ వ్యవస్థ ఎక్కడికైనా తేలికగా మోహరిం చగలదు. ఫలించిన పారికర్ దృఢ నిర్ణయం 2016లో రక్షణ మంత్రి మనోహర్ పారికర్ తీసుకున్న దృఢమైన నిర్ణయం ఫలితంగా, %ూ%-400 కొనుగోలు చేయవద్దని అమెరికా, భారత్‌పై ఎంతో ఒత్తిడి తీసుకువచ్చింది. మన దేశంలోని నేతలు వ్యతిరేకించినప్పటికీ.. భారత్‌కి చైనా, పాకిస్తాన్ నుంచి పొంచి ఉన్న ముప్పు కారణంగా వీటిని రష్యా నుంచి కొనుగోలు చేశారు. అదే ఇప్పుడు మనల్ని కాపాడింది. అదే కాకుండా ప్రపంచంలోనే అత్యుత్తమ డిఫెన్స్ టెక్నాలజీ ఆయన హయాంలోనే భారత్‌కు లభ్యమైంది. ఇప్పుడు ఆ విజ్ఞానం వాస్తవంగా ఫలాలు ఇస్తోంది. సాంకేతిక సమన్వయం, విజయం వెనుక ఉన్న శాస్త్రీయ శక్తి ఈ ఆపరేషన్ విజయవంతంగా సాగడానికి ప్రధాన కారణం.. భారత సైన్యం అత్యంత ఆధునిక వ్యవస్థలను ఖచ్చితంగా సమన్వయం చేయడమే. రియల్ టైం శాటిలైట్ ఇమేజింగ్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ జామింగ్ టెక్నా లజీలు Network-centric warfare ఆధారిత సమాచార బదిలీ మొత్తంగా, ఆపరేషన్ సిందూర్ ఒక సాంకేతిక విజ్ఞాన ఆధారిత దేశభక్తి.. శాస్త్ర, వ్యూహ, సామర్థ్యాల సమన్వయ రూపకల్పనగా నిలిచింది. ఇది భవిష్యత్తులో భారతదేశం సాధించబోయే వ్యూహాత్మక ఆధిక్యం వైపు తీసుకెళ్లే మరొక అడుగు.

# టర్కీ లేకపోతే ఇండియా.. బ్రిటిష్ వారికి బానిస అయ్యేది కాదు..! పచ్చి నిజాలు..

టర్కీ(తుర్కియే).. ఇండియాలో వ్యతిరేకత మూటగట్టుకున్న దేశం. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల సమయంలో తుర్కియే పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం, పాకిస్తాన్‌కు ఆయుధాలను సరఫరా చేయడమే దీనికి కారణం. ఆ విషయం పక్కనపెడితే.. అసలు టర్కీ లేకుంటే బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఆక్రమించి ఉండేవారు కాదని మీకు తెలుసా? ఈ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలను మార్చడంలో టర్కీ ప్రధాన పాత్ర పోషించింది. టర్కీ ప్రపంచాన్ని మార్చిన ఈ కథ దాదాపు 600 సంవత్సరాల నాటిది. 1453 సంవత్సరంలో నేటి ఇస్తాంబుల్(టర్కీ రాజధాని) ఒట్టోమన్ సామ్రాజ్యం ఆధీనంలోకి వచ్చింది. అంతకు ముందు ఆసియా, యూరప్ ఖండాల మధ్య వ్యాపించిన ఈ నగరాన్ని కాన్స్టాంటినోపుల్ అని పిలిచేవారు. దీనిని రోమన్ సామ్రాజ్యం 1500 సంవత్సరాలు పరిపాలించింది. అధికార మార్పుతో మొత్తం ప్రపంచం ఆర్థిక, రాజకీయ ధోరణి మారిపోయింది.

వాణిజ్యం ఆగిపోయింది..

కాన్స్టాంటినోపుల్ సింహాసనంపై కూర్చున్న కొత్త సామ్రాజ్యం చేసిన మొదటి పని యూరప్, ఆసియా మధ్య వాణిజ్యం జరిగే భూ మార్గాన్ని మూసివేయడం. ఆ సమయంలో ఐరోపాలో భారతీయ సుగంధ ద్రవ్యాలు, ముఖ్యంగా నల్ల మిరియాలు, వస్త్రాలు, ముఖ్యంగా మస్లిన్ (ఢాకా మస్లిన్) కు చాలా డిమాండ్ ఉండేది. వీటిని అక్కడ విలాస వస్తువులుగా అమ్మేవారు. కాన్స్టాంటినోపుల్‌కు వెళ్లే మార్గం మూసివేయడంతో ఈ వస్తువుల వ్యాపారం ఆగిపోయింది. అదే సమయంలో చైనా సిల్క్ రూట్ ద్వారా వాణిజ్యం కూడా ప్రభావితమైంది. ఈ ఒక్క సంఘటన తర్వాత యూరప్‌లో కొత్త వాణిజ్య మార్గాలను కనుగొనే పోటీ మొదలైంది. స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్, పోర్చుగల్ వంటి దేశాల నుండి చాలా మంది నావికులు తమ నౌకాదళాలతో భారతదేశానికి చేరుకోవడానికి సముద్ర మార్గాలను అన్వేషించడం ప్రారంభించారు. క్రిస్టోఫర్ కొలంబస్ కూడా భారతదేశానికి మార్గం వెతుక్కుంటూ బయలుదేరి అనుకోకుండా అమెరికా చేరుకున్నాడు. 1492 లో అమెరికా ఈ విధంగా కనుగొనబడింది. అయితే వాస్కో డి గామా పోర్చుగల్ నుండి వచ్చి ఆఫ్రికా తీరం వెంబడి సముద్రం ద్వారా ప్రయాణించి 'కేప్ ఆఫ్ గుడ్ హోప్' దాటి భారతదేశంలోని కాలికట్ చేరుకున్నాడు.వాస్కో డి గామా కనుగొన్న మార్గం చాలా సురక్షితమైనది. దీని తరువాత దాదాపు 100 సంవత్సరాల పాటు పోర్చుగీస్, డచ్ వారు భారతదేశం నుండి యూరప్‌కు బట్టలు, సుగంధ ద్రవ్యాలను వ్యాపారం చేశారు. ఈ వ్యాపారం ద్వారా అతను చాలా డబ్బు సంపాదించారు. భారతదేశంపై కూడా బంగారు



వర్షం కురిసింది. నల్ల మిరియాలు, మస్లిన్ వంటి వస్తువులకు ఐరోపాలో డిమాండ్ పెరుగుతూనే ఉంది, అయితే భారతదేశం నుండి ఈ వస్తువులను తీసుకురావడంలో పోర్చుగీసు వారికి గుత్తాధిపత్యం ఉంది. ఆ సమయంలో బంగారం, వెండి నాణేలు కరెన్సీగా చెలామణిలో ఉండేవి. భారతీయులు మిరియాలు, మస్లిన్ వంటి దుస్తులకు బదులుగా యూరప్ నుండి చాలా బంగారాన్ని పొందారు. ఈ విధంగా భారతదేశంలో బంగారు నిల్వలు భారీగా పెరిగాయి.

బ్రిటిష్ వారికి బానిసగా..

దాదాపు 100 సంవత్సరాల తరువాత 1600వ సంవత్సరంలో బ్రిటిష్ వారు భారత్‌కు వచ్చారు. ఆ తరువాత ఫ్రెంచ్, డానిష్ ప్రజలు కూడా ఈ వ్యాపారం నుండి లాభాలు సంపాదించడానికి భారతదేశానికి వచ్చారు. భారతదేశ వాణిజ్యాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఈ దేశాలన్నింటి మధ్య అనేక యుద్ధాలు కూడా జరిగాయి. బ్రిటిష్ వారు తమ తుపాకుల సహాయంతో చాలా చోట్ల గెలిచారు. ఈ చరిత్రలో ప్రధాన ఘట్టం 1757 నాటి 'ప్లాసీ యుద్ధం'. బెంగాల్ గడ్డపై జరిగిన ఈ యుద్ధం బ్రిటిష్ వారికి భారతదేశంలో తమ పట్టును స్థాపించుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు, 1764లో జరిగిన బక్సర్ యుద్ధం భారతదేశ చరిత్రను మార్చివేసింది, క్రమంగా దేశం బ్రిటిష్ వారికి బానిసగా మారింది.

# పాకిస్తాన్ నుంచి చేజారుతున్న బెలూచిస్తాన్.. స్వతంత్ర దేశంగా అవతరించబోతుందా..?

ముందు భారత్.. వెనుక బలూచ్. పాకిస్తాన్‌కు రెండువైపులా వాయింపుడు షురూ అయింది. బలూచ్ ముందు పాక్ తూచ్ అవుతోంది. %దీూూ% ఫైటర్స్.. మొన్న పాక్ ఆర్మీ జవాన్ల దుస్తులు విప్పేశారు. ఇప్పుడు మరింత ఉధృతంగా దాడులు చేస్తున్నారు. పాక్ ఆర్మీని తరిమికొడుతున్నారు. బలూచిస్తాన్‌లో విజయకేతనం ఎగురవేస్తున్నారు. పాక్‌కు బలూచ్ ఆర్మీ మరింత తలనొప్పులు తెస్తోంది. పాకిస్తాన్ చేతుల్లో నుంచి బలూచిస్తాన్ జారిపోతోంది. %దీూూ% వరుస దాడులతో పాక్ ఆర్మీ బెంబేలెత్తిపోతోంది. గత కొన్ని రోజులుగా బలూచిస్తాన్‌లో నాన్‌స్టాప్ వార్ జరుగుతోంది. పాక్ సైన్యాన్ని బలూచ్ లిబరేషన్ ఆర్మీ తరుముతోంది. బలూచిస్తాన్‌లో పలు చోట్ల పాక్ ఆర్మీపై %దీూూ% దాడులు చేస్తోంది. పాక్ పోలీస్ స్టేషన్లను స్వాధీనం చేసుకుని, హైవేలను నిర్బంధించింది. పాకిస్తాన్ పోలీసులను ఖైదు చేసింది. పాక్ ఆర్మీ ఇన్‌ఫార్మర్లను %దీూూ% ఫైటర్లు అదుపులోకి తీసుకుంటున్నారు. పాక్ బలగాలపై ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నారు. బాంబులతో పాక్ ఆర్మీ వాహనాలను పేల్చివేస్తున్నారు. కోటిన్నర జనాభా ఉన్న బెలూచిస్తాన్.. పాకిస్తాన్‌లోని అతిపెద్ద ప్రాంతం. బొగ్గు. బంగారం లాంటి ఖరీదైన ఖనిజ నిక్షేపాలతో పాటు సహజవాయు నిల్వలు అపారంగా ఉన్నా.. తమకు ప్రయోజనాలు దక్కడం లేదనేది స్థానికుల వాదన. పైగా.. పాకిస్తాన్ ప్రభుత్వం తమపై రాజకీయంగా కక్ష తీర్చుకుంటోందన్న ఆవేదన. వీళ్ల కడుపుమంట నుంచి పుట్టిందే బలూచ్ లిబరేషన్ ఆర్మీ.. బీఎల్‌ఏ. పాకిస్తాన్ నుంచి విడదీసి బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో పాతికేళ్ల కింద ఏర్పాటైన వేర్పాటువాద సంస్థ. పాకిస్తాన్-ఇరాన్ మధ్య విభజించిన ఇరానియన్ జాతి సమూహం. బలూచ్-నివాస ప్రావిన్సులు కేంద్ర ప్రభుత్వాలకు నిరంతరం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. సాయుధ స్వాతంత్ర్య ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. పుట్టింది ఆఫ్ఘన్ నగరం కాందహార్‌లో.. నలుగురితో మొదలై ఇప్పుడు 600 మంది సాయుధులతో మిలిటెంట్ ఆర్గనైజేషన్‌గా ఎదిగింది. మొదట్లో ఆఫ్ఘన్ నుంచే ఎటాకింగ్ షురూచేసేది. తర్వాత పాకిస్తాన్ లోపలికి జొరబడి బెలూచ్ నడిగడ్డ మీద నుంచే సవాల్ విసురుతోంది. ఇప్పుడు పాకిస్తాన్ మిలిటరీకి సమఉజ్జీగా మారి.. ఆ దేశ పాలకుల కంట్లో నలుసుగా మారింది. పాకిస్తాన్ ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యల్లో అత్యంత కీలకమైంది బెలూచ్ తిరుగుబాటు బెడద. "పాకిస్తాన్ ఒక వికృతమైన భావజాలమున్న న్యూక్లియర్ కంట్రీ.. ఐసిస్ లాంటి గ్లోబల్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌కు పాలు పోసి పెంచుతోంది.. ఈ మొత్తం ప్రోగ్రామ్ ఐఎస్ఐ కనుసన్నల్లోనే డిజైనౌతోంది.. మేమైతే సైలెంట్‌గా చూస్తూ కూర్చునేవాళ్లం కాదు%ఔ% 51 చోట్ల 71 సార్లు దాడులు చేశాం.. ఇప్పుడే సినిమా ఐపోలేదు.." అని పాకిస్తాన్ ఒరిజినల్ షేప్‌ను ప్రపంచానికి చాటి చెబుతోంది బెలూచ్ లిబరేషన్ ఆర్మీ. అది 1540 సంవత్సరం, భారతదేశపు మొట్టమొదటి మొఘల్ పాలకుడు బాబర్ కుమారుడు హుమాయున్, బీహార్‌కు చెందిన షేర్ షా సూరి చేతిలో ఓడిపోయాడు. హుమాయున్ భారతదేశం నుండి పారిపోయాడు. అతను



పర్షియాలో అంటే ఇరాన్‌లో ఆశ్రయం పొందాడు. షేర్ షా సూరి 1545లో మరణించాడు. అవకాశాన్ని గ్రహించి, హుమాయున్ భారతదేశానికి తిరిగి రావాలని ప్రణాళిక వేయడం ప్రారంభించాడు. అప్పుడు బలూచిస్తాన్ గిరిజన నాయకులు ఈ ప్రణాళికలో అతనికి సహాయం చేశారు. బలూచ్‌ల మద్దతుతో, హుమాయున్ 1555లో ఢిల్లీపై తిరిగి నియంత్రణ సాధించాడు. 1659 సంవత్సరం. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ఢిల్లీ పాలకుడు అయ్యాడు. అతని అధికారం పశ్చిమాన ఇరానియన్ సరిహద్దు వరకు విస్తరించింది. కానీ దక్షిణాన అతను నిరంతరం మరాఠాల నుండి సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. మరోవైపు బలూచి అధిపతులు మొఘల్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. బలూచి నాయకుడు మీర్ అహ్మద్ 1666లో ఔరంగజేబు నుండి బలూచిస్తాన్‌లోని రెండు ప్రాంతాలు %-% కలాట్, క్వెట్టాను స్వాధీనం చేసుకున్నాడు. నేడు బలూచిస్తాన్ ఉన్న ప్రదేశం చరిత్ర దాదాపు 9 వేల సంవత్సరాల నాటిది. ఆ సమయంలో ఇక్కడ మెహర్‌గఢ్ ఉండేది. ఇది సింధు లోయ నాగరికతలో ఒక ప్రధాన నగరం. దాదాపు 3 వేల సంవత్సరాల క్రితం సింధు లోయ నాగరికత ముగిసినప్పుడు, ఇక్కడి ప్రజలు సింధ్, పంజాబ్ ప్రాంతాలలో స్థిరపడ్డారు. దీని తరువాత ఈ నగరం వేద నాగరికత ప్రభావానికి లోనైంది. ఇక్కడ హిందువుల ప్రధాన శక్తి పీఠాలలో ఒకటి %-% హింగ్లాజ్ మాతా ఆలయం, దీనిని పాకిస్తాన్‌లో నాని కా హజ్ అని కూడా పిలుస్తారు. కాలక్రమేణా ఈ నగరం బౌద్ధమతానికి ప్రధాన కేంద్రంగా కూడా మారింది. ఏడవ శతాబ్దంలో అరబ్ ఆక్రమణదారులు ఈ ప్రాంతంపై దాడి చేసినప్పుడు, ఇక్కడ ఇస్లాం ప్రభావం పెరిగింది. బలూచిస్తాన్ పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం, దాని భూభాగంలో 44 శాతం ఆక్రమించింది. జర్మనీ పరిమాణంలో ఉన్నప్పటికీ, దాని జనాభా కేవలం 15 మిలియన్లు, ఇది జర్మనీ కంటే 70 మిలియన్లు తక్కువ. బలూచిస్తాన్ చమురు, బంగారం, రాగి మరియు ఇతర గనులతో సమృద్ధిగా ఉంది. ఈ వనరులను ఉపయోగించడం ద్వారా పాకిస్తాన్ తన అవసరాలను తీర్చుకుంటుంది. అయినప్పటికీ, ఈ ప్రాంతం అత్యంత వెనుకబడింది. బలూచిస్తాన్‌లో పాకిస్తాన్‌పై ద్వేషం పెరగడానికి ఇదే కారణం. పాకిస్తాన్ ఆక్రమణ తర్వాత బలూచిస్తాన్‌లో ఐదు ప్రధాన తిరుగుబాట్లు జరిగాయి. ఇటీవలి తిరుగుబాటు 2005లో ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే భారత్ సహా మిగతా దేశాల మద్దతును కూడదీసుకుని.. పాకిస్తాన్ పాలకుల్ని కార్నర్ చేయాలన్నది బీఎల్‌ఏ స్కెచ్చులా కనిపిస్తోంది. ఈ పాచిక కనుక పారితే.. ఆసియా ఖండంలో కొత్త దేశంగా బెలూచిస్తాన్ జెండా ఎగరడం ఖాయం. ఇది మాత్రం పక్కా..!

# నష్టాన్ని పూడ్చాల్సిందే, లేదంటే సీఎస్ జైలుకే - కంచ గచ్చిబౌలిపై సుప్రీం..!!

సంచలనంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్? జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చ రించింది. సీఎస్? తో పాటు కార్యదర్శులూ జైలుకు పోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. లాంగ్? వీక్? ఎండ్? చూసి ఎందుకు చర్యలు చేపట్టారని అధికారులను అడిగింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిందేనని స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించిన ధర్మాసనం హెచ్చరించింది. కాగా సీఈసీ దాఖలు చేసిన అఫిడవిట్‌పై కౌంటర్ వేసేందుకు కొంత సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. దీంతో జులై 23వ తేదీలోపు గతంలో ఉన్నట్లుగా అక్కడ పర్యావరణాన్ని పునరుద్ధరించాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణ జులై 23 వ తేదీకి వాయిదా వేసింది. అలాగే విద్యార్థులపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ దాఖలైన ఐఏను



సుప్రీంకోర్టు త్రోసి పుచ్చింది. ఆ విషయంలో ప్రత్యేకంగా మరో పిటీషన్‌ను దాఖలు చేయాలని, ఈ కేసులో కలపకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. గత విచారణ సందర్భంగా పర్యావరణ వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ.. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు యధాస్థితి కొనసాగించాలని పేర్కొంది. ఈలోగా ఒక్క చెట్టు కూడా నరకడానికి ఒప్పుకోమని స్పష్టం చేసింది. విచారణ ప్రారంభంలోనే వివరాలను పరిశీలించిన సీజేఐ తెలంగాణ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇష్టానుసారంగా డజన్ల కొద్దీ బుల్డోజర్లతో చెట్లు తొలగించేందుకు వినియోగించారని, ఇదంతా ముందస్తు పథకం ప్రకారమే చేసినట్టుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా.. లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలని జస్టిస్ గవాయ్ అన్నారు.

# ఎపిలో 19 ప్రాజెక్టులకు ఎస్ఐపిబి ఆమోదం



అమరావతి : ఎపిలో 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన 6 వ ఎస్ఐపిబి సమావేశం ముగిసింది. 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం లభించింది. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలకు సంబంధించి పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ముందుకొచ్చాయి. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు సంబంధించి ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకోవడానికి డాష్ బోర్డు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, గదుల కొరత ఉండటంతో ముఖ్యమంత్రి.. పెద్దఎత్తున హోటల్ రూములు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని వ్యాఖ్యానించారు. 50 వేల గదులు అందుబాటులోకి తేవాలి అనేది తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారని సిఎం వెల్లడించారు.

# మణిపూర్‌లో 10 మంది ఉగ్రవాదులు హతం



చందేల్ : మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో అస్సాం రైఫిల్స్ యూనిట్ కి, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మరణించారని అధికారులు తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్మీ తూర్పు కమాండ్ ఎక్స్ లో పోస్ట్ చేసింది. "ఇండో-మయన్మార్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న చందేల్ జిల్లా ఖెంగ్‌జోయ్ తహసీల్‌లోని న్యూ సమతాల్ గ్రామం సమీపంలో సాయుధ క్యాడర్ల కదలికలపై నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, స్పియర్ కార్ప్స్ ఆధ్వర్యంలోని అస్సాం రైఫిల్స్ యూనిట్ మే 14న ఆపరేషన్ ప్రారంభించింది" అని తెలిపింది. ఆపరేషన్ సమయంలో జరిగిన కాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మృతి చెందగా, భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. కోహిమాలో ఉన్న డిఫెన్స్ పిఆర్ఓ గురువారం ఉదయం పిటిఐతో మాట్లాడుతూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని,. అది ముగిసిన తర్వాత వివరాలను తెలియజేస్తామని తెలిపారు.

# అందాల భామలపై నీళ్లు పోస్తే కాళ్లు కడిగినట్టేనా?

## బీఆర్ఎస్‌పై మంత్రి ఫైర్



**హైదరాబాద్, :** తెలంగాణ మహిళలతో అందాల భామల కాళ్లు కడిగిస్తారంటూ బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి ఇది తీవ్ర అవమానకరమని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మిస్ వరల్డ్ పోటీదారులు ములుగు, రామప్ప దేవాలయ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయంలోకి వెళ్లే ముందు అందాల భామలు కాళ్లు కడుక్కుని వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు నీళ్లు పోయడం వివాదాస్పదమైంది. తాజాగా ఈ వ్యవహారంపై మంత్రి సీతక్క స్పందిస్తూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో అందాల భామల హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కావాలనే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాంక ట్రంప్ హైదరాబాద్ వచ్చినప్పుడు ఆమె వెంట తిరిగిన నాయకుడు ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గిరిజన సంప్రదాయంలో గుడిలోకి వెళ్లే ముందు కాళ్లు కడుగుకొని వెళ్లడం సంప్రదాయం.. అదే అక్కడ పాటించారన్నారు. ఆ సమయంలో ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్ అమ్మాయి.. కాళ్లకు నీళ్లు పోసిందని.. దాన్ని పట్టుకుని నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక వేళ తెలంగాణ ప్రభుత్వం కాళ్లు కడిగిస్తే.. అందరి కాళ్లు కడిగించాలి కదా? కానీ అక్కడ అలా జరగలేదన్నారు. అయినా దాన్ని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? అని బీఆర్ఎస్ నేతలపై ఫైరయ్యారు. కవితమ్మ కాళ్ల దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్లు మొక్కించుకోవడం మీ దురహంకారం కాదా? ఈ తీరు నచ్చకే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారని పేర్కొన్నారు. అసలు తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా? తెలంగాణ పేరునే మీ పార్టీ పేరులో నుంచి తీసేశారు కదా? అని ప్రశ్నించారు. ఈ మధ్య సబితా ఇంద్రారెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని.. ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసన్నారు. వాస్తవాలు మాట్లాడాలని.. అబద్ధాలు కాదని హితవు పలికారు. ఇప్పటికైనా అబద్ధాలకు అంబాసిడర్‌గా సబితమ్మ మారొద్దన్నారు. అధికారం పోయాక ప్రజల ఆత్మగౌరవం గుర్తొచ్చిందా? అంటూ మంత్రి నిలదీశారు.

# సుప్రీంను ప్రశ్నించిన రాష్ట్రపతి.. తప్పుపట్టిన సీఎం స్టాలిన్



న్యూఢిల్లీ: బిల్లుల క్లియరెన్స్ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. దాన్ని ప్రశ్నిస్తూ ఇవాళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము .. సుప్రీంకోర్టును ప్రశ్నించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద ఆమె సుప్రీంను వివరణ కోరారు. సుప్రీంను వివరణ కోరిన అంశంపై తమిళనాడు సీఎం స్టాలిన్ స్పందించారు. ఆ రిఫరెన్స్‌ను ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుదోవ పట్టించినట్లు అవుతుందని సీఎం స్టాలిన్ వెల్లడించారు. బీజేపీ ఆదేశాల ప్రకారమే తమిళనాడు గవర్నర్ తమ రాష్ట్ర బిల్లులను ఆపినట్లు స్టాలిన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఏజెండ్లు అయిన గవర్నర్ల ద్వారా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను బలహీన పరిచే ప్రక్రియ జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు నాన్ బీజేపీ రాష్ట్రాలు ఒక్కటి కావాలని ఆయన కోరారు. రాష్ట్రపతి ముర్ము చేసిన రిఫరెన్స్‌కు సమాధానం ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ బిల్లుకు ఆమోదం ఆలస్యం అయితే, అప్పుడు ఆ బిల్లులకు ఓకే చెప్పినట్లేనా అని ఆమె సుప్రీంను ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలతో కూడిన లేఖను రాష్ట్రపతి పంపారు.

# విశాఖలో మాయా లోకం


## రూ.460 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ హేబిటేట్ సెంటర్

## 2.82 ఎకరాల్లో వర్చువల్ రియాల్టీ ఎరీనా, త్రీ స్టార్ హోటల్

## పీపీపీ విధానంలో చేపట్టేందుకు కసరత్తు

## ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ దరఖాస్తుల ఆహ్వానం

## మధురవాడలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు



విశాఖ సిటీ: ఊహకందని అద్భుత ప్రపంచం కళ్ల ముందు సాక్షాత్కరించనుంది. కనివినీ ఎరుగని మాయాలోకం అందరినీ మంత్రముగ్ధులను చేయనుంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేనటువంటి మిథ్యా ప్రపంచం విశాఖ వాసులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. ఇందుకోసం విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. మధురవాడ ప్రాంతంలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వర్చువల్ వరల్డ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించడానికి 'వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాలిటీ ఎరీనా అండ్ త్రీ స్టార్ హోటల్'తో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులు ఆహ్వానించింది.

### రూ.470 కోట్లతో హేబిటేట్ సెంటర్

ఆధునిక వాతావరణంలో సంపన్న వర్గాల అభిరుచులకు తగ్గట్టుగా 'ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్'ను నిర్మించాలని వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. ఐటీ సంస్థలకు సమీపంలో ఎండాడ లా కాలేజీ నుంచి రుషికొండ రోడ్డులో 8.82 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. పీపీపీ విధానంలో రూ.470 కోట్లతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో ఐటీ స్పేస్, బిజినెస్ సెంటర్, రిటైల్ స్పేస్, ఆడిటోరియం, సెమినార్ హాల్, పార్టీ ఈవెంట్స్ లాన్‌లతో పాటు ట్రేడ్ ఫెయిర్లు, ఆర్ట్, కల్చర్ షో, ఎగ్జిబిషన్లకు అనువుగా సౌకర్యాలు కల్పించనున్నారు. అలాగే క్లబ్ హౌస్, అంతర్జాతీయ రుచులతో వంటలు అందించే రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తారు. అలాగే ఇండోర్ యాంఫీ థియేటర్, 400 మంది పట్టేలా కేఫ్‌టేరియా, 600 మంది సౌకర్యంగా కూర్చునే ఫైన్ డైన్ రెస్టారెంట్లు ఉండనున్నాయి. 60 రూములు కలిగిన హోటల్, 250 మందికి సరిపడా ఈవెంట్ లాన్, సూపర్ మార్కెట్, మెడికల్, స్పోర్ట్స్ సెంటర్లు కూడా రానున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీలోగా ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న సంస్థల అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నారు.వీలైనంత వేగంగా ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలని అధికారులు భావిస్తున్నారు.

### 2.82 ఎకరాల్లో వర్చువల్ ఎరీనా

విశాఖ వాసులకే కాకుండా ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా విశాఖలో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని అందించేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులు సరికొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటి వరకు పార్కులు, మ్యూజియాలు, కన్వెన్షన్ సెంటర్లపైనే దృష్టి పెట్టినవారు.. ఇప్పుడు భవిష్యత్తు తరాలకు ఆసక్తికరమైన, ఆకట్టుకునేలా వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్ నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ఎండాడ లా కాలేజ్ మార్గంలో 2.82 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. గేమింగ్, వర్చువల్ రియాలిటీ, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ వంటి సాంకేతికత అంశాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని పొందేలా 360 డిగ్రీల థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, చారిత్రక యుగాల అనుభవంలోకి తీసుకెళ్లేలా వర్చువల్ టైమ్ ట్రావెల్, వీఆర్ గేమింగ్ జోన్, 350 చదరపు మీటర్ల భారీ అక్వేరియం, 20 మల్టీక్యూజన్ రెస్టారెంట్ అవుట్‌లెట్లు, 10 శాతం కమర్షియల్ అవుట్‌లెట్లతో పాటు 100 రూమ్‌లు, 1000 మంది పట్టేలా ఫంక్షన్ హాల్‌తో త్రీ స్టార్ హోటల్‌ను నిర్మించనున్నారు.

### ఆర్థిక, పర్యాటకానికి అనుగుణంగా..

పర్యాటకాభివృద్ధి కోసమే కాకుండా ఆర్థిక పరిపుష్టికి అనుగుణంగా రెండు కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నాం. ఐటీ సంస్థలకు సమీపంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో వర్చువల్ రియాలిటీ ఎరీనాతో పాటు అర్బన్ హేబిటేట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఇందుకోసం ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించాం. ఇవి ఏర్పాటైతే ప్రపంచ పర్యాటకులకు మంచి అనుభూతిని పంచడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణకు వేదికలుగా నిలుస్తాయి.

# మన వేలితో మన కన్నే..!

## తుర్కియే నైచ్యానికి పరాకాష్ట

## భారత ముడి పదార్థాలతోనే డ్రోన్లు

## వాటినే పాక్‌కు పంపిన కండకావరం

## సైనికులను కూడా పంపినట్టు వెలుగులోకి

రెండేళ్ల క్రితం భయానక భూకంపం వేళ తుర్కియేకు అందరికంటే ముందు ఆపన్న హస్తం అందించింది భారతే. 'ఆపరేషన్ దోస్త్' పేరిట భారీ సాయం చేసింది. కానీ ఆ దేశం మాత్రం తిన్నింటి వాసాలే లెక్కబెడుతోంది. సాయుధ సంఘర్షణ వేళ దాయాది పాకిస్తాన్‌కు ఎడాపెడా డ్రోన్లు, ఇతర ఆయుధాలను అందజేసి కృతఘ్నుతకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. విశ్వాస ఘాతుకానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. వాటితో పాటు సైనికులను, శిక్షణా సిబ్బందిని కూడా పాక్‌కు తుర్కియే భారీగా పంపినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. డ్రోన్ల వాడకం తదితరాల్లో వాళ్లు పాక్ జవాన్లకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చినట్టు తేలింది. పాక్‌కు తుర్కిష్ కంపెనీ ఆసిస్‌గార్డ్ సోంగార్ పంపిన బైరక్తార్ టీబీ2, ఈహా డ్రోన్లు ఆత్మాహుతి తరహావి. లక్ష్యంపై పడి పేలిపోతాయి. ఈ డ్రోన్ల తయారీలో భారత్ ఎగుమతి చేసే కీలకమైన మూలకాలు, ముడి సరుకులే ప్రధాన వనరులు కావడం విశేషం! మనకు వ్యతిరేకింగా ఇలా నిస్సిగ్గుగా బరితెగించిన తుర్కియేకు ఆ కీలక ఎగుమతులను తక్షణం నిలిపేయాలని రక్షణ నిపుణులు సూచిస్తున్నారు.

### కంట్రోలర్ల నుంచి రిసీవర్ దాకా...

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రశిబిరాలను భారత్ కుప్పకూల్చిన కొద్ది గంటలకే పాక్ దాదాపు 400 డ్రోన్లతో సరిహద్దు ప్రాంతాలపై దాడికి తెగించడం తెలిసిందే. తుర్కియేకు భారత ఎగుమతుల్లో సింహభాగం అల్యూమినియం, అల్యూమినియం సంబంధ ఉపకరణాలు, ఆటో ఉత్పత్తులు, విమానాల విడిభాగాలు, టెలికం ఉపకరణాలు, ఎలక్ట్రిక్ వస్తువులు, పరికరాలు తదితరాలే. వీటిలో చాలావరకు డ్రోన్ల తయారీలో కీలకం. డోన్లలోని కంట్రోలర్, ఫ్రేమ్, మోటార్, ప్రొపెల్లర్, కెమెరా, ఫ్లైట్ కంట్రోల్, రిసీవర్, వీడియో ట్రాన్స్‌మిటర్, యాంటెన్నా, స్పీడ్ కంట్రోలర్, కంట్రోలర్లను కూడా భారత్ నుంచే తుర్కియే దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా కరోనా తర్వాత ఈ ఎగుమతులు ఎక్కువచయ్యాయి. ఆ విడిభాగాలతో రూపొందించిన డ్రోన్లను పాక్‌కు అందజేయాలన్నది తుర్కియే అధ్యక్షుడు రెసిప్ తయ్యిప్ ఎర్డోగన్ నిర్ణయమేనని తెలుస్తోంది. అతనికి అంతులేని భారత విద్వేషిగా పేరుంది. తమ డ్రోన్లు, ఆయుధాలను భారత్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదనే ఒట్టు పెట్టుకున్నారు!

### మన విమానాశ్రయాల భద్రతతుర్కియే సంస్థ చేతుల్లో!

భారత్‌లోని పలు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా అంశాల్లో కూడా తుర్కియే పరోక్షపాత్ర ఉందని వెలుగులోకి వచ్చింది. వాటిలో కార్గో హ్యాండ్లింగ్ వంటి కీలక కాంట్రాక్టులను తుర్కియేకు చెందిన సెలెబీ ఏవియేషన్ కంపెనీ చెందిన అనుబంధ సంస్థ సంపాదించిందని తేలింది. భారత్‌లో 2008 నుంచి ఈ సంస్థ సేవలందిస్తోంది. ఏటా 58,000 విమానాలు, 5.4 లక్షల టన్నుల సరకు రవాణా బాధ్యతలను చూసుకుంటోంది. అందులో 7,800 మంది సిబ్బంది ఉన్నారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్, గోవా, కొచ్చిన్, కన్నూర్ వంటి కీలక విమానాశ్రయాల్లో హై సెక్యూరిటీ బాధ్యతలు సెలెబీవే! గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో మేనేజ్‌మెంట్, ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్ విధులను ఈ సంస్థే చూస్తోంది. విమానాలను నిలిపి ఉంచే హై సెక్యూరిటీ జోన్, ఎయిర్‌సైడ్ జోన్లన్నా సంస్థ సిబ్బందే విధుల్లో ఉంటున్నారు. ప్రయాణికుల బ్యాగులు, కార్గో పనులను చూసుకునేదీ వాళ్లే. అంతర్జాతీయ సర్వీసుల్లో కూడా ఈ బాధ్యతలను వీళ్లకే అప్పగించారు. తాజా పరిణామాల నేపథ్యంలో దీనిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆరు దేశాల్లోని 70 విమానాశ్రయాల్లో కూడా సెలెబీ కాంట్రాక్టులు సంపాదించింది.

### ముమ్మరంగా 'బ్యాన్ తుర్కియే'

పాక్‌కు సైనికసాయం చేస్తున్నందుకు నిరసనగా తుర్కియే ఉత్పత్తులను బహిష్కరించాలన్న డిమాండ్లు దేశవ్యాప్తంగా ఊపందుకున్నాయి. ఇకపై తుర్కియే యాపిల్ పండ్లను దిగుమతి చేసుకోవద్దని మహారాష్ట్రలోని కీలకమైన పుణె పండ్ల మార్కెట్ ట్రేడర్లు నిర్ణయించుకున్నారు. "మన సైన్యానికి మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నాం. తుర్కియేకు బదులు ఇక హిమాచల్, ఉత్తరాఖండ్ ఇరాన్ నుంచి ఆపిల్స్ తెప్పిస్తాం" అని పుణె వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీ ట్రేడర్ సుయోగ్ జిందే చెప్పారు. పుణెలో తుర్కియే యాపిల్స్ టర్నోవర్ రూ.1,200 కోట్ల పై చిలుకే. దాంతో ఈ నిర్ణయం ఆ



దేశానికి పెద్ద దెబ్బే కానుంది. తుర్కియే నుంచి తెల్ల చలువరాయి దిగుమతులనూ నిషేధించాలన్న డిమాండ్లు విన్పిస్తున్నాయి.

### యాత్రలూ బంద్!

తుర్కియేకు మనోళ్ల విహార యాత్రలు కూడా భారీగా తగ్గాయి. ఆ దేశానికి క్యాన్సలేషన్‌లు భారీగా పెరుగుతున్నాయని ఈజ్‌మైట్రిప్, ఇగ్జిగో వంటి ఆన్‌లైన్ ట్రావెల్ ప్లాట్‌ఫాంలు తెలిపాయి. తుర్కియే ప్రభుత్వ వార్తా చానల్ 'టీఆర్‌టీ' తాలూకు 'ఎక్స్' ఖాతాను కేంద్రం బ్లాక్ చేసింది. టర్కీతో మన వాణిజ్యం కూడా తగ్గుముఖం పడుతోంది. 2024-25 మధ్య తుర్కియేకు మన ఎగుమతులు 5.2 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌కు బాహాటంగా మద్దతు ప్రకటించిన అజర్‌బైజాన్‌కు కూడా ఇదే సెగ తగులుతోంది. దాని రాజధాని బకు ఇటీవలి దాకా భారత పర్యాటకులకు ఫేవరెట్ డెస్టినేషన్లలో ఒకటిగా ఉండేది. ఏటా లక్షలాది మంది అక్కడికి వెళ్లేవారు. బకుకు బుకింగులు కూడా ఇప్పుడు భారీగా తగ్గిపోతున్నాయి.

### జేఎన్‌యూ కటీఫ్

తుర్కియే విద్యాసంస్థలతోనూ తెగదెంపులు చేసుకోవాలనే డిమాండ్‌ల నేపథ్యంలో ఆ దేశంలోని ఇనోను వర్సిటీతో అవగాహన ఒప్పందాన్ని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) రద్దు చేసుకుంది. జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. గత ఫిబ్రవరిలో కుదిరిన ఈ మూడేళ్ల ఒప్పందం ప్రకారం రెండు వర్సిటీల విద్యార్థులు, అధ్యాపకుల మార్పి డికి అవకాశముండేది.

# టార్గెట్లూ- టార్చర్లూ!



తెలుగు రాష్ట్రాల్లో కోడి పందాల సమయంలో అనేక వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. వాటిని నిర్వహిం చొద్దంటూ హైకోర్టు నుంచి ఆదేశాలు, పోలీసుల నుంచి హెచ్చరికలు వస్తుంటాయి. కానీ వాటిల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోవు. యదేచ్ఛగా పందాలు కొనసాగుతాయి. మరుసటిరోజే టీవీల్లో, పేపర్లలో వార్తలొస్తాయి. కానీ వాటిపై ఎవరూ చర్యలు తీసుకోరు. ఇప్పుడు ఇదేవిధంగా ఉన్నాయి ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల తీరూతెన్నులు. వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహించొద్దు, పిల్లలను ఒత్తిడికి గురిచేయొద్దంటూ ప్రభుత్వం, విద్యాశాఖ పదేపదే హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. ఈ సంవత్సరం కూడా ఆ పరంపర కొనసాగింది. కానీ హైదరాబాద్ సహా జిల్లాలు, మండల కేంద్రాల్లోని అనేక ప్రయివేటు, కార్పొరేట్ కాలేజీలు సర్కారు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. వార్షిక పరీక్షలు ముగిసిన ఏప్రిల్‌లోనే మళ్లీ పైతరగతుల క్లాసులను ప్రారంభించాయి. ప్రారంభించటమే గాదు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశా లలకు ఫోన్లు చేసి, అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలంటూ లెక్చరర్లను, సిబ్బందిని అవి ఆదేశించటం గమనార్హం. ఈ రకంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆయా కాలేజీలు.. మరోవైపు తమ వద్ద పనిచేసే అధ్యాపకులు, సిబ్బంది మెడపై మరోకత్తిని వేలాదీయటం కలవరపాటుకు గురిచేస్తోంది. 'మీ ఉద్యోగాలు ఉండాలంటే కచ్చితంగా మేం చెప్పిన పనులు చేయాల్సిందే. ఒక్కొక్కరు ఇంటింటికీ తిరిగి పిల్లలను పట్టుకుని రావాలి, అడ్మిషన్లు చేయించాలి, ఫీజులు వసూలు చేసే బాధ్యతను సైతం మీరే తీసుకోవాలి. అలాగని ఒకరో ఇద్దరో పిల్లల్ని తీసుకొస్తే సరిపోదు, కనీసంలో కనీసంగా ఓ పదిహేను మందిని కాలేజీల్లో చేర్పించాలి, లేదంటే మీదారి మీరు చూసుకోవాల్సి ఉంటుంది' అంటూ హుకూం జారీ చేయటం పరిపాటిగా మారింది. దీంతో ఏం చేయాలో పాలు పోక ప్రయివేటు అధ్యాపకులు, సిబ్బంది తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. ఇది ఒకరకమైన వేధింపులైతే.. నాణేనికి రెండోవైపు ఇంకోరకమైన సాధింపులు కొనసాగుతుండటం అధ్యాపకులను మరింత ఒత్తిడిలోకి నెడుతోంది. ఇటీవల విడుదలైన ఇంటర్, ఎమ్‌సెట్, జేఈఈ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల ఘనతను తమ ఖాతాల్లో వేసుకుంటున్న యాజమాన్యాలు.. ఫెయిలైన విద్యార్థులు, మార్కులు, ర్యాంకుల్లో వెనుకబాటును మాత్రం లెక్చరర్ల వైఫల్యాలుగా చిత్రీకరిస్తూ వారిని ఆత్మనూన్య తాభావానికి గురి చేస్తుండటం విస్మయకరమైన అంశం. ఆ వైఫల్యాలకు వారిని బాధ్యులను చేస్తూ ఒక బ్రాంచి నుంచి మరోదానికి మారుస్తూ వారి జీవితాలతో ఆటాడుకుంటున్న దృష్టాంతాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ఇవన్నీ ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగంపై ప్రభుత్వ అజమాయిషీ కొరవడిన వైనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. నియమ నిబంధనలకు విరుద్ధంగా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ఆయా విద్యాసంస్థలు తమకున్న పలుకుబడిని ఉపయోగించి, ఇష్టానుసారంగా రాజ్యాన్నేలు తున్నాయి. వేలమందికి అడ్మిషన్లు ఇస్తున్న పలు కార్పొరేట్ కాలేజీలు..కొన్ని వందల మందికి మాత్రమే మార్కులు, ర్యాంకులు తెప్పిస్తున్నాయనే విషయాన్ని మనం మరువరాదు. ఆ మార్కులు, ర్యాంకులనే పెద్దపెద్ద హోర్డింగుల ద్వారా ప్రచారార్భాటం చేసుకుంటూ వందల కోట్లను ఆయా సం స్థలు పోగేసుకుంటున్నాయి. మిగతా ఫెయిలైన విద్యార్థుల సంఖ్యను, ఆ సంగతిని ఏమాత్రం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటూ తమ వైఫల్యాలను మరుగుపరుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవటం వారి నిష్క్రియాపరత్వం, నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామంటూ చెబుతూనే.. మరోవైపు కార్పొరేట్ కాలేజీలకు ఎర్ర తివాచీలు పరవటం వారికే చెల్లింది. మన రాష్ట్రంలో సాక్షాత్తూ ముఖ్యమంత్రే, విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. మొన్నటి పది, ఇంటర్, ఎప్‌సెట్ ఫలితాల్లో ప్రభుత్వ బడులు, కళాశాలలు, గురుకులాలు%ౌ% ప్రయివేటు, కార్పొరేట్‌కు ధీటుగా తమ సత్తా చాటాయి. ఈ నేపథ్యంలో వాటిని మరింత బలోపేతం చేయటం ద్వారా కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి విద్యారంగాన్ని కాపాడాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకుల మెడపై కత్తి పెట్టి, బోధనేతర పనులను అప్పగిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. అప్పుడే నాణ్యమైన విద్యాబోధన సాధ్యం.

